

కష్టంలో తోడుగా.. నష్టంలో చేదోడుగా..

- తక్కువ సమయంలో వైపరీత్యాన్ని దాటేశాం
- ఏకంగా 15 రోజుల్లోనే పరిహారం అందజేత
- ఈనెల 30లోగా చివరి బాధితుడికీ సాయం
- ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటన

ఈనాడు డిజిటల్, అమరావతి

“భారీ వర్షాలు.. వరదలకు అనేక ప్రాంతాలు నీటమునిగాయి. బుడమేరు ముంచెత్తి.. విజయవాడ అతలాకుతలమైంది. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు ఏకమయ్యారు. ఉద్యమంలా అంతా కదిలారు. దీంతో 10 రోజుల్లోనే విపత్తు నుంచి బయటపడగలిగాం.”

– ముఖ్యమంత్రి చంద్రబాబు


ఎన్టీఆర్ కలెక్టరేట్‌లో బుధవారం వరద బాధితులకు పరిహారం విడుదల చేశారు. అనంతరం మీడియాతో చంద్రబాబు మాట్లాడారు. రాష్ట్రంలో అత్యధికంగా 32 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైతే.. ఒక్క విజయవాడలోనే 42 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. బుడమేరు కట్టలన్నీ గత ప్రభుత్వంలో ఆక్రమణలకు గురవడంతో వరద ఉద్ధృతికి గండ్లు పడ్డాయి. ఫలితంగా నగరం నీటమునిగిందన్నారు.

నగరంలోనే అధిక నష్టం..

చరిత్రలో విజయవాడకు ఎప్పుడూ రాని వరద ముంచెత్తింది. బుడమేరుకు గండ్లు పడడంతో నగరంలోనే అధిక నష్టం జరిగింది. అనేక ఇళ్లు, గృహోపకరణాలు, వాహనాలు, వ్యాపార సముదాయాలు, పంటలకు తీవ్రనష్టం వాటిల్లిందన్నారు. వరద తగ్గిన 15 రోజుల్లోనే నష్టాన్ని అంచనా వేసి, పరిహారాన్ని అందించామన్నారు. దేశంలో ఇప్పటి వరకు ఏ ప్రభుత్వమూ ఎన్నడూ ఇవ్వనంత పరిహారాన్ని అందించామన్నారు. స్వచ్ఛంద సంస్థలు, బ్యాంకులు, ప్రైవేటు ఏజెన్సీల ద్వారా బాధితులకు రుణాలు, గృహోపకరణాల మరమ్మతులు, వాహనాల ఇన్సూరెన్సు క్లెయిమ్‌లు చేశామన్నారు. నగరంలో కొత్తగా 18 వేలు దరఖాస్తులు వచ్చాయనీ, వాటిలో 5 వేల దరఖాస్తుల వరకు నకిలీవన్నారు. మిగిలినవి పునఃపరిశీలించి పరిహారాన్ని అందిస్తామన్నారు. చిన్నచిన్న సమస్యలను ఈ నెల 30వ తేదీ లోగా పరిష్కరిస్తామన్నారు.

జిల్లాకు సీఎం విడుదల చేసిన నష్టపరిహారం వివరాలు..

	ఎన్ని	ఒక్కోదానికి (రూ.వేలు)	పరిహారం (రూ.కోట్లు)
మొత్తం ఇళ్లు	78,558		
గ్రౌండ్ ఫ్లోర్	64,799	25	161.99
మొదటి అంతస్తు, ఆపైన	13,759	10	13.76
ద్విచక్ర వాహనాలు	44,402	3	13.22
ఆటోలు	4,348	10	4.34
చనిపోయిన పశుసంపద, మనుషులకు			6.83
వ్యవసాయ పంటలు హెక్టార్లు	1,12,345	25	278
హార్టికల్చర్ (హెక్టార్లు)	9,236	35	32.67
తోపుడు బళ్లు	1,243	20	2.48
కిరాణా షాపులు, హోటళ్లు	5,181	25	12.97
చిన్నతరహా పరిశ్రమలు	2,500	50	12.50
మధ్య తరహా పరిశ్రమలు	469	రూ.లక్ష	4.69
పెద్ద తరహా పరిశ్రమలు	197	1.5లక్ష	2.95





కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు. పక్కన మంత్రులు నాదెండ్ల మనోహర్, అనగాని సత్యప్రసాద్, పొంగూరు నారాయణ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్, మంత్రులు సత్యకుమార్, పయ్యావుల కేశవ్, వంగలపూడి అనిత, గుమ్మడి సంధ్యారాణి



కలెక్టరేట్ వద్ద సీఎం అభివాదం

యంత్రాంగం కృషి భేష్

వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు ప్రభుత్వ పరంగా సేవలందించడంతో జిల్లా యంత్రాంగం సమర్థంగా పని చేసిందని ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. వరద బాధితులకు నష్టపరిహారం అందించేందుకు జిల్లా కలెక్టరేట్‌కు వచ్చిన ముఖ్యమంత్రి బ్యాంకింగ్, బీమా సంస్థల ప్రతినిధులతో పాటు ఎన్యూమరేషన్‌లో భాగమైన జిల్లా అధికారులతో మాట్లాడారు. అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంగా నష్ట గణన వేసేలా సమర్థంగా పనిచేసిన కలెక్టర్ సృజనను ప్రత్యేకంగా అభినందించారు.

కన్నబిడ్డలా చూసుకున్నారు..

– సమీరున్నీసా, రామలింగేశ్వర నగర్, విజయవాడ

మేం రామలింగేశ్వర నగర్‌లో ఉంటాం. మా కాలనీకి వరదొచ్చిన మొదటి రోజు చాలా ఇబ్బంది పడ్డాం. రాత్రంతా నిద్రలేకుండా గడిపాం. తర్వాత రోజు పునరావాస కేంద్రానికి తరలించారు. అక్కడ మూడు పూటలా నాణ్యమైన భోజనం పెట్టారు. కన్నబిడ్డలా చూసుకున్నారు. వరదకు ఇంట్లో వస్తువులన్నీ దెబ్బతిన్నాయి. ప్రభుత్వం ప్రకటించిన ఈ రూ.25వేలు ఆర్థిక సహాయంతో వస్తువులన్నీ సమకూర్చుకుంటాం. సీఎంకు రుణపడి ఉంటాం.

మళ్లీ దుకాణం ప్రారంభిస్తా



– మహ్మద్ రఫీ, కిరాణా షాపు, కండ్రిక

మా ఇంట్లో నలుగురం ఉంటాం. మాకు కిరాణా దుకాణమే జీవనాధారం. రాత్రికి రాత్రి వరద ముంచెత్తింది. ఇల్లు.. దుకాణం నీటమునిగాయి. వరద ఉన్నన్ని రోజులూ.. ఆహారానికి కొరత లేకుండా ఇచ్చారు. పడవపైన సీఎం పర్యటించి మా సమస్యలు తెలుసుకున్నారు. కిరాణా దుకాణానికి రూ.5 వేలు వస్తుందనుకున్నా. ఊహించిన దాని కంటే.. ఎక్కువగా రూ.25 వేలు సాయం చేశారు. దీంతో దుకాణాన్ని మళ్లీ ప్రారంభిస్తాను.

ప్రభుత్వ అన్ని విధాలుగా ఆదుకుంది

– సాపావతి కుమారి, రామలింగేశ్వరనగర్, విజయవాడ



మా ప్రాంతంలో మూడు రోజులు వరద నిల్వ ఉంది. పడవల ద్వారా ఆహారం, మంచి నీరు సంవృద్ధిగా అందించారు. వరద నుంచి తేరుకున్నాక కూడా బియ్యం, నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఇంట్లో సామగ్రి తడిచి పాడయ్యాయి. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ దృష్టికి మా సమస్యలు తీసుకెళ్లాం. అధికారులు వచ్చి ఇంటిని పరిశీలించారు. రూ.25 వేలు ఇస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించడం ఆనందంగా ఉంది. ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకుంది.

కొండ పైనుంచి దిగే.. మార్గాలు సిద్ధం

- శివాలయం మెట్ల పక్కనే భారీగా తాత్కాలిక ఏర్పాట్లు

ఈనాడు, అమరావతి

ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలకు మరో వారం రోజులే ఉండడంతో.. నిర్వహణ ఏర్పాట్లు త్వరితగతిన సాగుతున్నాయి. భక్తులు కొండ దిగువ నుంచి ఐదు లైన్లలో దర్శనాలకు వెళ్లి.. తిరిగి కిందకు దిగేందుకు రెండు మూడు మార్గాలను ఈసారి వినియోగించాలని భావిస్తున్నారు. ఈసారి శివాలయం మెట్ల మార్గం లేకపోవడంతో.. ప్రధానంగా దిగే మార్గాలపైనే దృష్టిసారించారు. ఈ నేపథ్యంలోనే శివాలయం మెట్ల మార్గం పక్కనే తాత్కాలిక మెట్ల మార్గాన్ని సిద్ధం చేశారు. విశాలంగా ఉండేలా.. భారీ ఇనుప మెట్ల మార్గాన్ని భక్తుల కోసం ఏర్పాటు చేశారు. ఈ మార్గాన్ని నగర పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు బుధవారం పరిశీలించి.. సంతృప్తి వ్యక్తం చేశారు. దీనితో పాటు మహామండపం ర్యాంప్, మెట్ల మార్గాలు కూడా భక్తులు దిగేందుకు వాడనున్నట్టు ఈవో రామారావు వెల్లడించారు.

శరవేగంగా...

ఘాట్‌రోడ్డులో ప్రస్తుతం క్యూలైన్ల పనులు చేపడుతున్నారు. టోల్‌గేట్ దాటాక మొదటి మలుపు వద్ద రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తయింది. క్యూలైన్లు, వాటిపైన రెయిన్‌ప్రూఫ్ పైకప్పు, ప్రసాదాలు, టిక్కెట్ కౌంటర్లు, వైద్యారోగ్యశాఖ సహా అన్ని విభాగాలు సేవలు అందించేలా షామియానాల ఏర్పాటు, కేశఖండనశాల, స్నానాల ఘాట్లలో సౌకర్యాలు చేపడుతున్నారు. రాష్ట్ర దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ సత్యనారాయణ దుర్గగుడిలో దసరా ఉత్సవాల ఏర్పాట్లపై బుధవారం సమీక్షించారు. ప్రధానంగా ఇంజినీరింగ్ పనులు, ఘాట్‌రోడ్డులో సౌకర్యాలు, ప్రముఖులు, దివ్యాంగులు, వృద్ధుల దర్శనాలకు ప్రత్యేక సమయం కేటాయింపు, ఉభయదాతలకు వాహనాల ఏర్పాటు, ఆలయ అలంకరణ, లైటింగ్, కౌంటర్లు, ఉచిత ప్రసాదం, అన్నదానం, పది రోజులు భక్తులకు సరిపడ ప్రసాదాల విక్రయాలు, నిరుడు ఇబ్బందులు అధిగమించాల్సిన చర్యలను సమీక్షించారు. పనుల పురోగతిపై.. ఈవో రామారావు, ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఉత్సవాల్లో ఏటా ప్రధానంగా ఎదురయ్యే సమస్య వీఐపీ, వీవీఐపీల రాకపోకలే. పెద్ద సంఖ్యలో కార్లలో ఘాట్ రోడ్డుపైకి ప్రముఖులు అన్ని వేళల్లా వచ్చేస్తుండడంతో సాధారణ భక్తుల దర్శనాలకు తీవ్ర ఆటంకాలు ఎదురవుతున్నాయి. దసరా తొమ్మిది రోజులు. . ప్రధాన ఆలయం చుట్టుపక్కల, మెట్ల మార్గాల్లో సిఫార్సులతో వచ్చేవారు, ప్రముఖుల రద్దీ విపరీతంగా ఉంటుంది. దీంతో సాధారణ క్యూలైన్లలో భక్తుల దర్శనాలు ఆలస్యం అవుతుంటాయి. అందుకే ఈసారి అలా జరగకుండా ప్రముఖులకు ఉదయం 8-10 గంటలు, మధ్యాహ్నం 2-4గంటల మధ్యలోనే దర్శనాలకు రావాలని ప్రత్యేక సమయాన్ని కేటాయిస్తున్నారు. దివ్యాంగులు, వృద్ధులకు కూడా సాయంత్రం 04-05 గంటల మధ్యలోనే ప్రత్యేక దర్శనాలకు అనుమతించాలని ప్రాథమికంగా నిర్ధరించారు. దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవాల ముందు నిర్వహించబోయే సమావేశంలో ఈ ప్రత్యేక సమయాలపై తుది నిర్ణయం తీసుకోనున్నారు.



దుర్గాఘాట్‌లో బుధవారం రాత్రి నిర్వహించిన నదీ హారతి

నిత్య హారతుల ట్రయల్ రన్..

దుర్గాఘాట్‌లోనే ఈసారి నదీ హారతులు కొనసాగించనున్నారు. ఇప్పటికే ఘాట్‌లో పంటిలపై నవ హారతుల ట్రయల్‌రన్‌ను నిత్యం కొనసాగిస్తున్నారు. నగరానికి సమీపంలోనే ఘాట్ ఉండడంతో ఆలయానికి నిత్యం తరలివచ్చే వేల మంది భక్తులు వీక్షించే వీలుందనీ, ఇక్కడే హారతులను నిర్వహించాలని నిర్ణయించారు. ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం ప్రాంతంలో కృష్ణా, గోదావరి నదులు కలిసే ప్రాంతంలో గతంలో హారతులు వైభవంగా నిర్వహించారు. ఇప్పుడు కూడా అక్కడే నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని తొలుత భావించారు. కానీ.. అక్కడ పూర్తి ఏర్పాట్లు చేసే వరకు దుర్గాఘాట్‌లోనే కొనసాగించాలని నిర్ణయించారు. ఉత్సవాల తొలి రోజున అక్టోబరు 03 నుంచే పూర్తిస్థాయిలో దుర్గాఘాట్‌లో నదీ హారతి ఆరంభం కానుంది. హారతులను తిలకించేందుకు దసరాల్లో భక్తులను అనుమతించాలా? లేదా అనే దానిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

‘విజయ’ ఛైర్మన్ చలసానికి పదవీ గండం..!

- రాజీనామా చేయాలని అధిష్ఠానం ఆదేశం
- డెయిరీ పాలకవర్గ సభ్యుల మల్లాగుల్లాలు



ఈనాడు, అమరావతి
– న్యూస్‌టుడే హనుమాన్ జంక్షన్

కృష్ణా జిల్లా పాల ఉత్పత్తిదారుల సంఘం.. విజయ డెయిరీ ఛైర్మన్ చలసాని ఆంజనేయులుకు పదవీ గండం ఏర్పడింది. ఆయన స్థానంలో మరొకరికి అవకాశం ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించినట్లు తెలిసింది. దీంతో డెయిరీ ఛైర్మన్ చలసానిని రాజీనామా చేయాలని సూచించినట్లు సమాచారం. అధిష్ఠానం నిర్ణయం ప్రకారం రాజీనామా చేసి పదవి నుంచి వైదొలగాలని ఎంపీ కేశినేని చిన్ని.. చలసానికి తెలియజేశారు. దీంతో విజయ డెయిరీ పాలకవర్గంలో కలకలం రేగింది. దీనిపై బాపులపాడు మండలం వీరవల్లిలోని పాల కర్మాగారంలో బుధవారం పాలకవర్గ అత్యవసర భేటీ నిర్వహించారు. దీనిలో అత్యధిక సభ్యులు సీఎం చంద్రబాబును కలిసి విన్నవించాలనీ, ఆయన నిర్ణయం ప్రకారం ముందుకు వెళదామని నిర్ణయించినట్లు తెలిసింది. ఒక దశలో రాజీనామాకు సిద్ధపడిన ఆంజనేయులును డైరెక్టర్లు వారించినట్లు తెలుస్తుండగా.. అసలు డైరెక్టర్ల మద్దతు ఉన్నందున రాజీనామా చేయాల్సిన పనిలేదని కొందరు పేర్కొన్నట్లు తెలిసింది. విజయ డెయిరీ ఛైర్మన్‌గా చలసాని అయిదేళ్లుగా కొనసాగుతున్నారు. అంతకు ముందు రెండేళ్లు డైరెక్టర్‌గా ఉన్నారు.

ఎమ్మెల్యేతో విభేదాలా..?

ఇటీవల గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఛైర్మన్‌పై ఆరోపణలు చేసిన నేపథ్యంలో ప్రస్తుతం రాజీనామా వ్యవహారం తెదేపాలో చర్చనీయాంశంగా మారింది. తనపై ప్రతికూల వార్తలు రాయించారని (ఈనాడులో కాదు) చలసానిపై ఎమ్మెల్యే యార్లగడ్డ పత్రికా సమావేశం పెట్టి మరీ ఆరోపించారు. దీనికి చలసాని సమాధానం ఇస్తూ.. తనకు ఏమాత్రం సంబంధం లేదని వివరణ ఇచ్చారు. ఈ పంచాయతీ అధినేత చంద్రబాబు దృష్టికి వెళ్లింది. యువనేత లోకేశ్ సీరియస్ అయ్యారని తెలిసింది. ఇటీవల ఉమ్మడి కృష్ణా జిల్లా ఎమ్మెల్యేలు ఎంపీ చిన్ని ఇంట సమావేశమై పలు అంశాలతోపాటు.. విజయ డెయిరీ అంశమూ చర్చించినట్లు తెలిసింది. దీనిపై పార్టీకి నివేదించడం ఆ మేరకు పదవి నుంచి వైదొలగాలని ఆదేశాలు రావడం జరిగాయి.





తటస్థంగా ఉండడమేనా..?

గత అయిదేళ్లలో చలసాని తెదేపా కార్యక్రమాలకు దూరంగా ఉంటూ తటస్థంగా వ్యవహరించారనేది ప్రధాన ఆరోపణ. గన్నవరం నియోజకవర్గ నేతగా ఆయన పార్టీ శ్రేణులను నడిపించడంలో క్రియాశీలకంగా వ్యవహరించలేదనే ఫిర్యాదులు ఉన్నాయి. లోకేశ్ పాదయాత్ర గన్నవరం మీదుగా వెళ్లినా.. చలసాని పాల్గొనలేదనేది శ్రేణుల ఫిర్యాదు. చంద్రబాబు సతీమణి భువనేశ్వరిపై ప్రేలాపనల వేళా క్రియాశీలకంగా గళం వినిపించలేదనే ఆరోపణ ఉంది. వీటిని ఆయన ఖండిస్తున్నారు. పార్టీ కోసం పనిచేశాననీ.. అమూల్ సంస్థను ఢీ కొట్టి విజయ డెయిరీని నిలబెట్టానని చెబుతున్నారు. వీరవల్లి వద్ద రూ.200 కోట్లు పెట్టుబడితో కొత్త మిల్క్ ప్రాజెక్టు చేపట్టామనీ, దానికి వైకాపా ప్రభుత్వం నుంచి ఆటంకాలు రాకుండా పోరాడానని చెబుతున్నారు. తాను వచ్చే నాటికి రూ.600 కోట్లు టర్నోవర్ ఉన్న మిల్క్ ప్రాజెక్టును నేడు రూ.వెయ్యి కోట్లకు చేర్చామని అంటున్నారు. మండవ జానకి రామయ్య తర్వాత చలసానికి డెయిరీ ఛైర్మన్‌గా అవకాశం ఇచ్చారు. మండవ రాజీనామా కూడా నాటకీయ పరిణామాల మధ్య జరిగింది.

డైరెక్టర్ల నియామకం..!

పాలకవర్గంలో ఇటీవల ఖాళీ అయిన మూడు డైరెక్టర్ల పదవుల నియామకమూ వివాదస్పదమైంది. ఎన్నిక నిర్వహించగా అధిష్ఠానం సూచన మేరకు ఎవరూ నామినేషన్ వేయకపోవడంతో ఎన్నిక రద్దయింది. అయితే పాలకవర్గ సమావేశం రెండుసార్లు వాయిదా పడింది. మూడోసారి డైరెక్టర్ల నియామకం చేపట్టాలని నూజివీడు, గుడివాడ, పెనమలూరు ఎమ్మెల్యేల సిఫార్సుతో ముగ్గురు తెదేపా నాయకులను డైరెక్టర్లుగా ఎన్నుకొన్నారు. అధిష్ఠానం అనుమతి లేకుండా నియమించారనే ఫిర్యాదు ఉంది. దీనిపై కూడా పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం.

దాసరి బాలవర్ధనరావు..?

కొత్త ఛైర్మన్‌గా దాసరి బాలవర్ధనరావుకు అవకాశం ఇవ్వాలని పార్టీ నిర్ణయించినట్లు సమాచారం. అయితే.. సీఎంను కలిసి తననే కొనసాగించాలని చలసాని, పాలకవర్గ సభ్యులు కోరాలని నిర్ణయించారు. సీఎం కరుణిస్తే.. చలసాని కొనసాగుతారు. లేకపోతే డైరెక్టర్లలో ఒకరైన బాలవర్ధనరావుకు అవకాశం లభించనుంది.



సుమారు 4 అడుగుల మేర కొట్టుకుపోయి..



కల్వర్టుల వద్ద..

వరద గాయం.. దారులు మాయం



రోడ్డు మార్జిన్ పరిస్థితి

బుడమేరు వరద విధ్వంసం ఇది. ఈ నెల 1న బుడమేరు వరద కారణంగా రామవరప్పాడు ఇన్నర్ రింగురోడ్డు నుంచి ముస్తాబాద వెళ్లే మార్గం ధ్వంసమైపోయి తీవ్ర నష్టం వాటిల్లింది. సుమారు 1.5 కి.మీ 4 అడుగుల మేర మట్టి కొట్టుకుపోయి రోడ్డు మార్జిన్ విరిగిపోయింది. కొన్నిచోట్ల రోడ్డు కింద మట్టికొట్టుకుపోయి తారు వేలాడుతోంది. దాని పైనుంచి వాహనాలు వెళ్తున్నాయి. ఏమాత్రం తారు విరిగినా గుంతలో పడిపోయే ప్రమాదం పొంచి ఉంది. కల్వర్టుల కింద కూడా ఇదే పరిస్థితి నెలకొంది. – ఈనాడు, కృష్ణా

అక్టోబరు 3 నుంచి దసరా ప్రత్యేక బస్సులు

13 రోజుల పాటు తిరగనున్న సర్వీసులు ◆ మొత్తం 964 తిప్పేలా ఆర్టీసీ ప్రణాళిక

ఈనాడు, అమరావతి

దసరా ఉత్సవాలకు ఆర్టీసీ సిద్ధమవుతోంది. రద్దీకి తగ్గట్లుగా సర్వీసులు నడిపేందుకు సంస్థ ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేసింది. కనకదుర్గమ్మ శరన్నవ రాత్రి ఉత్సవాలు వచ్చే నెల 3 నుంచి 12 వరకు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుంచి విజయవాడకు రాకపోకలు సాగించేందుకు.. అమ్మవారి దర్శనార్థం పెద్దసంఖ్యలో భక్తులు తరలి వస్తుంటారు. ఇదే సమయంలో పాఠశాలలు, కళాశాలలకు పండగ సెలవులు ఉన్నందున ఊళ్లకు వెళ్లే వారు ఎక్కువగా ఉంటారు. దీంతో పండగకు ఉండే ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అక్టోబరు 3 నుంచి 15 వరకు 13 రోజులపాటు ప్రత్యేక బస్సులు నడపనున్నారు.

ఈ ఏడాది రూట్ల వారీగా దసరా బస్సుల ప్రణాళిక

మార్గం	బస్సులు
హైదరాబాద్	353
రాజమహేంద్రవరం	241
విశాఖపట్నం	90
బెంగళూరు	14
చెన్నై	22
ఇతర ప్రాంతాలు	244
మొత్తం	964

విజయవాడ - హైదరాబాద్ అత్యధికం...

ఈ ఏడాది అన్ని మార్గాల్లో కంటే హైదరాబాద్‌కు అత్యధికంగా 353 తిప్పనున్నారు. ఈ రూట్‌లోనే ఎక్కువ డిమాండ్ ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. భాగ్యనగరంలో విద్య, ఉద్యోగాల నిమిత్తం ఉంటున్న జిల్లావాసుల సౌకర్యార్థం ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆతర్వాత రాజమహేంద్రవరం మార్గంలో తిరుగుతాయి. తొలి మూడు రోజులు 37 సర్వీసులు చొప్పున నడుపుతారు. మూలా నక్షత్రం.. 9వ తేదీన అమ్మవారి దర్శనానికి సుమారు 2.5 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా. ఈ నేపథ్యంలో ముందు రోజు నుంచి బస్సుల సంఖ్యను గణనీయంగా పెంచి 9న.. 105, 10న.. 117, 11న.. 128 తిప్పనున్నారు. పండగ తర్వాత రోజు ఆదివారం రావడంతో 13న 128, 14న.. 103 సర్వీసులు నడపాలని నిర్ణయానికి వచ్చారు.



గత ఏడాది రూ.2.35 కోట్ల ఆదాయం

2023లో దసరా ప్రత్యేక సర్వీసుల ద్వారా రూ.2.35 కోట్ల ఆదాయం సమకూరింది. కొవిడ్ తర్వాత ఇంత ఆదాయం రావడం ఇదే మొదటిసారి. మొత్తం 959 బస్సులు 5.30 లక్షల కి.మీ మేర తిప్పారు. కి.మీకు రూ.44.36 మేర రాబడి వచ్చింది. ఓఆర్ 66 శాతం నమోదైంది. హైదరాబాద్ - విజయవాడ మార్గంలో నడిచిన సర్వీసుల ద్వారా గరిష్ఠంగా రూ.1.08 కోట్ల ఆదాయం దక్కింది. ఆతర్వాత విశాఖపట్నం రూట్‌లో రూ.75.52 లక్షల మేర రాబడి వచ్చింది. 2021లో రూ.1.45 కోట్లు, 2022లో రూ.2.10 కోట్లు ప్రత్యేక సర్వీసుల ద్వారా ఆర్టీసీకి సమకూరింది.

దెబ్బతిన్న వాహనాల కోసం.. బీమా లోక్ అదాలత్

అక్టోబరు 1 నుంచి 7 వరకు నిర్వహణ

ఈనాడు, అమరావతి: వరదలతో దెబ్బతిన్న వాహనాల బీమా క్లెయిమ్‌ల సత్వర పరిష్కారానికి వచ్చే నెల 1 నుంచి 7వ తేదీ వరకు విజయవాడలో బీమా లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఏపీ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి (జిల్లా అండ్ సెషన్స్ జడ్జి) ఎం.బబిత తెలిపారు. రాష్ట్ర సచివాలయం సమీపంలో ఉన్న న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో బీమా కంపెనీలు, ఆటో మొబైల్ బాడీ షాప్స్, ఆటో డ్రైవర్ల సంఘాల ప్రతినిధులతో బుధవారం సమావేశం నిర్వహించారు. బబిత మాట్లాడుతూ.. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ప్యాట్రన్ ఇన్ చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, కార్యనిర్వాహక అధ్యక్షులు జస్టిస్ జి.నరేందర్ ఆదేశాలతో అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజయవాడలోని న్యాయస్థానాల సముదాయంలో అదాలత్ జరుగుతుందని వెల్లడించారు. బీమా క్లెయిమ్‌లు, వాహన మరమ్మతుల విషయంలో సమస్యలుంటే పరిష్కారానికి జాతీయ టోల్ ఫ్రీ నంబరు 15100కు ఫోన్‌చేసి, ఉచిత న్యాయ సేవలు పొందొచ్చని తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఉప కార్యదర్శి డాక్టర్ హెచ్.అమర రంగేశ్వరరావు మాట్లాడుతూ బీమా క్లెయిమ్‌ల పరిష్కారానికి లోక్ అదాలత్ సరైన వేదిక అని తెలిపారు.

పల్లెదనం.. పాడి ఘనం

అమెరికా నుంచి వచ్చిన డెయిరీ ఫామ్ నిర్వహణ

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే


పెళ్లయిన తొలినాళ్లలో భర్త అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుండేవారు. దంత వైద్య విద్యనభ్యసించిన ఆమె కూడా అమెరికాలోనే స్థిరపడాలనుకున్నారు. కానీ హరియాణా జాతిపశు సంపదను వృద్ధి చేయాలనే లక్ష్యంతో భర్త ఉద్యోగం వదులుకుని స్వగ్రామానికి వచ్చి, డెయిరీ ఫామ్, ఆ తర్వాత సెమన్ బ్యాంకు స్థాపించారు. ఇదే క్రమంలో ఆమె తనకు ఆసక్తి ఉన్న బోటిక్‌ను నెలకొల్పారు. దీనిపై ఆదాయం బాగానే ఉన్నా ఏదో సాధించాలన్న తపన ఆమెను డెయిరీ ఫామ్ వైపు మళ్లించింది. భర్త అదే రంగంలో ఉన్నప్పుడు తాను కూడా అనుబంధంగా స్వచ్ఛమైన పాల ఉత్పత్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని సంకల్పించారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలోనే అత్యాధునిక, అత్యుత్తమ డెయిరీ ఫామ్‌ను ఏర్పాటు చేశారు కృష్ణా జిల్లా వీరవల్లికి చెందిన చిలకపాటి అంజనా రాజీవ్.



మేలు జాతి ముర్రా గేదెల పోషణ

రోజుకు 600 లీటర్లు

బాపులపాడు మండలం వీరవల్లి సమీపంలో దాదాపు అయిదెకరాల విస్తీర్ణంలో అధునాతన డెయిరీ ఫామ్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టిన అంజనా.. తొలుత 20 పాడి గేదెలతో తన ప్రస్థానం ప్రారంభించారు. భర్త రాజీవ్ మార్గదర్శనంలో హరియాణా జాతిలో అత్యుత్తమమైన గేదెల్ని కొనుగోలు చేశారు. క్రమంగా ఈ సంఖ్యను 120కు చేర్చారు. భవిష్యత్తులో 200 గేదెలు తన ఫామ్‌లో ఉండాలన్న లక్ష్యంతో ముందుకు వెళుతున్నారు. ప్రస్తుతం రోజుకు సుమారు 600 లీటర్ల మేర పాలు ఉత్పత్తి చేస్తున్నారు. గేదెల సంరక్షణ కోసం అత్యాధునిక షెడ్లు నిర్మించారు. నామమాత్రపు కూలీలతో దాదాపుగా యాంత్రీకరణతో నిర్వహించేలా దీనిని తీర్చిదిద్దారు. పశువులు తినే మేత దగ్గర్నుంచి, తాగే నీరు, పాలు పితకడం సహా అంతా యంత్రాల సాయంతోనే కొనసాగుతుండడం గమనార్హం.



ప్యాకింగ్ తీరు పర్యవేక్షిస్తున్న అంజనా

ప్రత్యేకంగా వైద్యుడిని నియమించుకొని..

కరోనా సమయంలో మంచి పాల లభ్యత అంతంతమాత్రంగానే మారడమే తనను డెయిరీ ఫామ్ వైపు నడిపించిందని అంజనా తెలిపారు. అందుకే ముర్రా జాతిని ఎంపిక చేసుకుని, అన్ని వైద్య పరీక్షలు నిర్వహించి, ఎలాంటి వ్యాధి లేదని నిర్ధారించుకున్న తర్వాతే వాటిని డెయిరీ ఫామ్‌లోకి అడుగుపెట్టేలా జాగ్రత్తలు పాటిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఓ పశువైద్యుడ్ని నియమించుకున్నారు. 365 రోజులూ ఒకే రకం మేత, దాణాను ఇవ్వడం ద్వారా పాల ఉత్పత్తిలో వైరుధ్యం రాకుండానూ చూసుకుంటున్నారు.

సొంత బ్రాండ్‌తో అమ్మకాలు

తన డెయిరీ ఫామ్‌లో ఉత్పత్తి చేసిన పాలను తానే మార్కెటింగ్ చేసుకునేలా అంజనా కార్యాచరణ రూపొందించుకున్నారు. ఇందుకోసం అధునాతన శీతలీకరణ యంత్రాలు ఏర్పాటు చేసుకుని 'డెలిషియస్ డీల్' పేరుతో బ్రాండ్ రూపొందించుకుని ప్యాకెట్ల రూపంలో అమ్మకాలు చేస్తున్నారు. విజయవాడలో తన బోటిక్ వద్దే పాలు విక్రయిస్తున్నారు. భర్త రాజీవ్, మామ పద్మనాభరావు ప్రోత్సాహంతోనే తాను ఈ రంగంలో రాణిస్తున్నట్లు అంజనా చెబుతున్నారు.

ఆక్వారంగం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

చినగొల్లపాలెం, గరిశపూడి (కృత్తివెన్ను), న్యూస్‌టుడే: తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు గడిస్తున్న పండుగప్పను కేజ్ కల్చర్ ద్వారా సాగు చేస్తున్న విధానాన్ని కలెక్టర్ డి.కె.బాలాజీ పరిశీలించారు. బుధవారం కృత్తివెన్ను మండలం చినగొల్లపాలెం, గరిశపూడి, పెదలంక డ్రెయిన్లను క్షేత్రస్థాయిలో పర్యటించి, వనామి, పండుగప్ప సాగు వివరాలు తెలుసుకున్నారు. ఆక్వా రంగం అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు. ఆయన ముందుగా చినగొల్లపాలెం దీవిలోని శ్రీసాయిహరిత్ హేచరీని సందర్శించారు. వనామి రొయ్యల సీడు పెంపకం విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. వివిధ దశల్లో వనామి సీడును, దానికి ఆహారంగా వేసే ఆల్గే, ఆర్టిమియాను పరిశీలించారు. అనంతరం గరిశపూడిలోని వనామి రొయ్యల సాగును స్థానిక రైతులను అడిగి తెలుసుకున్నారు. రొయ్యలకు వచ్చే వ్యాధులు, వాడే మందులు, వనామి కౌంట్ రొయ్యలు, మార్కెట్ రేట్లపై ఆరా తీశారు. గరిశపూడి పంచాయతీలోని అండర్ టన్నెల్ దిగువన పెదలంక డ్రెయిన్‌పై పండుగప్ప కేజ్ కల్చర్ సాగును మరపడవపై వెళ్లి స్వయంగా పరిశీలించారు. అనంతరం మునిపెడ గ్రామంలో ఉన్న మిలేష్ మెరైన్ ప్రాసెసింగ్ ప్లాంటును సందర్శించి రొయ్యల ప్రాసెసింగ్ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఎగుమతులపై ఆరా తీశారు. ఆయన వెంట మత్స్యశాఖ జేడీ చంద్రశేఖర్, ఏడీ నాగబాబు, ఎఫ్‌డీవో అంజని, తహసీల్దార్ కేజీఎస్ సోమేశ్వరరావు, గరిశపూడి, చినగొల్లపాలెం సర్పంచులు నాగిడి నాగార్జున, పెనుమాల సునీల్, రెవెన్యూ, మత్స్యశాఖ అధికారులు పాల్గొన్నారు.



శ్రీసాయిహరిత్ హేచరీని పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ తదితరులు


అండర్ టన్నెల్‌ను పునరుద్ధరించండి : రైతులు

బ్రిటీష్ పరిపాలనలో రూపుదిద్దుకున్న అండర్ టన్నెల్ శిథిలావస్థకు చేరిందని, మళ్లీ పునరుద్ధరించాలని రైతులు కలెక్టర్ బాలాజీకి విజ్ఞప్తి చేశారు. ఈ టన్నెల్ కూలిపోతే కృత్తివెన్ను మండలంలో ఏడు పంచాయతీలకు తాగు నీరు, సాగునీరు పూర్తిగా నిలిచిపోతుందని తెలిపారు. డ్రైనేజీ అధికారులతో చరవాణిలో కలెక్టర్ మాట్లాడారు. అంచనాలు వేసి నిర్మాణం చేపట్టే చర్యలు తీసుకుంటామని రైతులకు కలెక్టర్ హామీ ఇచ్చారు.

సీఎం సహాయ నిధికి విరాళాలు



ముఖ్యమంత్రి చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న పెనమలూరు గ్రామస్థులు, ఎమ్మెల్యే బోడే ప్రసాద్



చెక్కు అందజేస్తున్న యార్లగడ్డ రూప్‌కుమార్, వెంకటేశ్వరరావు తదితరులు

పెనమలూరు, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వరద బాధితులను ఆదుకోవాలంటూ పెనమలూరు గ్రామస్థులు రూ.6.50 లక్షలను ఎమ్మెల్యే బోడే ప్రసాద్‌తో కలిసి సీఎం చంద్రబాబుకు చెక్కుల రూపంలో బుధవారం అమరావతిలో అందజేశారు. ఇందులో రూ.5.50 లక్షలు గ్రామస్థుల విరాళం కాగా రూ.మరో లక్ష గ్రామంలోని సాయిబాబా ట్రస్టు తరఫున సంస్థ నిర్వాహకుడు కోయ గోపాలకృష్ణ అందించారు. తెదేపా నేతలు మారుపూడి ధనకోటేశ్వరరావు, కోయ ఆనంద్, తోటకూర ఉదయ భాస్కర్, కిలారు శ్రీను, శ్రీనుబాషా తదితరులు పాల్గొన్నారు.

రూ.5 లక్షల వితరణ

కానూరు: వరద బాధితులకు కానూరు వీఆర్ సిద్ధార్థ వాకర్స్ అసోసియేషన్ తరఫున రూ.5 లక్షల సాయాన్ని అందించారు. ఈ మేరకు బుధవారం సీఎం కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును అసోసియేషన్ అధ్యక్షుడు యార్లగడ్డ రూప్‌కుమార్, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు కలిసి చెక్కు అందజేశారు. పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్, తెదేపా మహిళా అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర, కేవీఆర్‌కే ప్రసాద్ పాల్గొన్నారు.

27న మచిలీపట్నంలో ఉద్యోగమేళా

భాస్కరపురం (మచిలీపట్నం), న్యూస్‌టుడే: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన శాఖ, డీఆర్‌డీఏ-సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో మచిలీపట్నం ఇమిటేషన్ జ్యువెలరీ పార్క్ వెల్ఫేర్ అసోసియేషన్ పార్కులో ఈ నెల 27న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.విక్టర్‌బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎన్.శ్రీనివాసరావు బుధవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. జాబ్ మేళాలో టెక్ ట్రోన్స్, బిజినెస్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, గోల్డ్‌ఫిన్ జ్యువెల్ ఇండస్ట్రీ ఇండియా లిమిటెడ్, వీఎన్‌ఆర్ జ్యువెలరీ మ్యానుఫాక్చరర్స్, సుదా గోల్డ్ కవరింగ్ వర్క్స్ వంటి ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నట్లు చెప్పారు. ఈ కంపెనీల్లో ఉద్యోగాలకు పది, ఇంటర్, డిగ్రీ, పోస్టు గ్రాడ్యుయేట్ చేసిన 18 నుంచి 35 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.10వేల నుంచి రూ.25వేల వరకు వేతనంతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి, అర్హతలు కలిగిన అభ్యర్థులు ముందుగా https://skilluniverse.apssdc.in లింక్‌లో తమ పూర్తి వివరాలతో రిజిస్టర్ కావాలని సూచించారు. జాబ్‌మేళాకు బయోడేటా ఫారం, ఆధార్, సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో రావాలని, ఇతర వివరాలకు 9966489796 నంబరులో సంప్రదించాలన్నారు.

ఓపెన్ స్కూల్స్ సమీక్షా సమావేశం

పామర్రు: బడి మధ్యలో మానివేసిన వారు ఓపెన్ స్కూల్లో ప్రవేశం పొందేలా చూడాలని జిల్లా ప్రభుత్వ పరీక్షల విభాగ సహాయ కమిషనర్ ఎన్.డేవిడ్‌రాజు అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఓపెన్ స్కూల్స్ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర సార్వత్రిక విద్యాపీఠం గుంటూరు వారి ఆదేశాల మేర పదో తరగతి, ఇంటర్ ప్రవేశాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం గోడపత్రిక ఆవిష్కరించారు. కళాశాల ప్రిన్సిపల్ అరుణప్రభ, రాష్ట్ర సమన్వయకర్త పి.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

'కొడాలి నానీ.. దేవునితో ఆటలాడొద్దు'

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీపై యావత్ భారతదేశం తీవ్ర వేదనతో ఉంటే.. దాని బాధ్యుల గురించి మాట్లాడకుండా వారేదో ఘన కార్యం చేసినట్లు, తప్పును ఒప్పు చేయాలనుకోవడం పిచ్చి ప్రేలాపన అని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము విమర్శించారు. బుధవారం రాత్రి స్థానిక ప్రజావేదిక తెదేపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో మీ మన కార్యాలయం మీరు అవసరం లేదని ప్రజలంతా తరిమి కొడితే కనీసం సిగ్గులేకుండా మీడియా ముందుకు రావడం హాస్యాస్పదమన్నారు. గతంలో మీరు అధికారంలో ఉండగా ఆంజనేయ స్వామి విగ్రహం చేయి విరగడం, రథం దహనం, దుర్గమ్మ గుడిలో 10 కేజీల విగ్రహాలు అదృశ్యం వంటి ఘటనలు జరిగితే.. కొడాలి నాని ప్రజల మనోభావాలతో ఎలా ఆడుకున్నారో ఎమ్మెల్యే రాము గుర్తు చేశారు. జగన్ చేసిన తప్పు కప్పి పుచ్చడానికి మీరు చేసే ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని, గుడివాడ వస్తే మీకు ప్రజల చేతిలో గుణపాఠం తప్పదన్నారు. దమ్ముంటే నందివాడ మండలంలో వరద బాధిత ప్రాంతాలకు రండి చూద్దాం అంటూ రాము సవాల్ విసిరారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కొడాలి నాని గుడివాడ వస్తే వెంకన్న భక్తులు తగిన శాస్తి చేసి పంపుతారని తెలిపారు. గుడివాడలో సామాన్యుల భూములు కాజేసి, పేదల భూములు 22ఏ కిందకు మార్చేసి అందరినీ నట్టేట ముంచిన మీకు గుడివాడలో ఘన సన్మానం తప్పదని, అందుకే రావట్లేదన్నారు. జనసేన బాధ్యుడు బూరగడ్డ శ్రీకాంత్, రాష్ట్ర తెదేపా వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి గోకవరపు సునీల్, మండల పార్టీ అధ్యక్షుడు వాసే మురళీ తదితరులు పాల్గొన్నారు.

డీసీఈబీ కార్యాలయం ప్రారంభం

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: డీసీఈబీని బలోపేతం చేయడంతో పాటు తరచుగా వర్క్‌షాపులు నిర్వహించాలని డీఈవో తాహెరా సుల్తానా అన్నారు. మచిలీపట్నంలోని డీఈవో కార్యాలయ భవనంలో ఏర్పాటు చేసిన జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు (డీసీఈబీ) కార్యాలయాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె కార్యాలయంలో ఏర్పాటు చేసిన వసతులు తదితరాలను పరిశీలించి ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. డీసీఈబీ కార్యదర్శి జాన్‌సాహెబ్, విద్యా శాఖ ఏడీలు అజీజ్, మనోహర్‌నాయక్, ప్రభుత్వ పరీక్షల జిల్లా అసిస్టెంట్ కమిషనర్ డేవిడ్‌రాజు, డీవైఈవో శేఖర్‌సింగ్, ఏఎస్‌వో అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాల పేర్లు మార్చి మాయ చేసిన వైకాపా

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వ పథకాలకు పేర్లు మార్పుతోనే గత ప్రభుత్వ పాలన కొనసాగిందని భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకుని గన్నవరం మండలం జక్కులనెక్కలంలో బుధవారం నిర్వహించిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్రాధ్యక్షుడు చిగురుపాటి కుమార స్వామితో కలిసి ఆమె పాల్గొని మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ పాలనలో పలు దాడులు జరిగాయని ఆరోపించారు. వైకాపా అరాచక పాలనపై విసుగెత్తిన ప్రజలు ఎన్డీయే కూటమికి విజయం అందించారని గుర్తు చేశారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్ సహా పలు విషయాల్లో పూర్తి సహకారం అందిస్తూ రాష్ట్రాభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. ప్రపంచంలో ఐదవ ఆర్థిక శక్తిగా భారతదేశం ఎదిగిందని, అందుకు ప్రధాని మోదీ నాయకత్వంలోని భాజపా బలోపేతమే కారణమన్నారు. తొలుత బుద్ధ మేరు ముంపు పొలాలను ఆమె పరిశీలించారు. అనంతరం స్థానికంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి మట్ట ప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పంతం గజేంద్ర, మైనార్టీ మోర్చా అధ్యక్షుడు బాజీ, నాయకులు నాదెండ్ల మోహన్, మల్లికార్జునరాజు, శేషుమాధవి తదితరులతో కలిసి సభ్యత్వ నమోదును ప్రారంభించి.. చేకూరే లబ్ధిని ప్రజలకు వివరించారు.



మాట్లాడుతున్న దగ్గుబాటి పురందేశ్వరి, పక్కన కుమార స్వామి తదితరులు

'జగన్ పాలనలో మసకబారిన ఆలయాల ప్రతిష్ఠ'



వేకనూరు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

వేకనూరు(అవనిగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: వైకాపా గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలోని పలు ప్రముఖ దేవాలయాల ప్రతిష్ఠ మసకబారిందని, ఇందుకు తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీ ఘటనే నిదర్శనమని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. లడ్డూలో కల్తీ నెయ్యి వినియోగాన్ని నిరసిస్తూ వేకనూరులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం అర్చక స్వాములు సంప్రోక్షణ నిర్వహించగా.. బుద్ధప్రసాద్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆలయాలను ప్రక్షాళన చేయాల్సి ఉందన్నారు. మోపిదేవి ఆలయంలో అవినీతి, అక్రమాలపై దేవాదాయ శాఖ చేపట్టిన విచారణపై తనకు నమ్మకం లేదన్నారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి ఏసీబీ విచారణ కోరతానని బుద్ధప్రసాద్ చెప్పారు. తిరుమల విచారణ మాదిరిగా రాష్ట్రంలోని అన్ని ప్రముఖ దేవాలయాల్లో కూడా జరగాల్సిన అవసరం ఉందని బుద్ధప్రసాద్ తెలిపారు. సర్పంచి శ్రీలక్ష్మి, ఉపసర్పంచి మురళీకృష్ణ, వేణుగోపాలరావు, వెంకట్రామ్, శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆపద్బాంధవుడు పవన్‌కల్యాణ్ : నాగాయలంక ఎదురుమొండి దీవుల్లో ఎదురుమొండి-గొల్లమంద కరకట్ట రహదారి నిర్మాణానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఏఐఐబీ నిధులు సమకూర్చి సమస్యను పరిష్కరించి దీవుల ప్రజల ఆపద్బాంధవుడుగా నిలిచారని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. వేకనూరులో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కలెక్టర్ డీకే బాలాజీ, తాను ఇటీవల దీవుల్లో పర్యటించి కరకట్ట రహదారి సమస్యలపై వీడియో తీయించి పవన్ పరిశీలనకు పంపగా ఆయన స్పందించి ఎదురుమొండి- గొల్లమంద మార్గంలో బ్రహ్మయ్యగారి మూల రహదారి నిర్మాణానికి పరిపాలనా ఆమోదం సవరణ ప్రతిపాదనలు రూ.409.18 లక్షల నుంచి రూ.1345 లక్షలకు పెంచి ఏఐఐబీ నిధుల కింద ఈ నెల 27వ తేదీలోపు చేపట్టాలని పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ చీఫ్ తెలిపారన్నారు. ఇందుకు పవన్ కల్యాణ్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు బుద్ధప్రసాద్ తెలిపారు. మండలి వెంకట్రామ్, తెదేపా మండలపార్టీ అధ్యక్షుడు యాసం చిట్టిబాబు, జనసేన నాయకులు మత్తి వెంకటేశ్వరావు, గుడివాక శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో తొలి ఎల్ఎన్‌జీ బంకు ఏర్పాటు

హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే : భారీ సరకు రవాణా వాహనాలకు డీజిల్‌కు ప్రత్యామ్నాయంగా ఉపయోగించే లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్(ఎల్ఎన్‌జీ) బంకు బాపులపాడు మండలం వేలేరులో ఏర్పాటైంది. దేశంలోనే ఇది అయిదో బంకు కాగా, మన రాష్ట్రంలో ఇదే ప్రథమమని ఐవోసీఎల్ అధికారులు తెలిపారు. కాలుష్యాన్ని తగ్గించే క్రమంలో కేంద్ర ప్రభుత్వం డీజిల్‌కు ప్రత్యామ్నాయంగా ఎల్ఎన్‌జీను ప్రోత్సహిస్తుంది. డీజిల్ కంటే తక్కువ ధరకు ఇది లభ్యమవుతుందని, మైలేజీ కూడా 3-4 కి.మీ అదనంగా వస్తుందని అధికారులు చెబుతున్నారు. ఈ సందర్భంగా బుధవారం ఐవోసీఎల్ డీఎం కేవీ అనిల్‌కుమార్, చీఫ్ మేనేజర్ అనిల్‌కుమార్ ఈ బంకుని పరిశీలించారు. రోజుల వ్యవధిలోనే దీన్ని అందుబాటులోకి తీసుకు రానున్నట్లు డీలర్ రమణకుమార్ తెలిపారు.



ఎల్ఎన్‌జీ పంప్

రూ.23 కోట్లతో గ్రామీణ రహదారుల అభివృద్ధి

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు రూ.23 కోట్లతో గుడివాడ నియోజకవర్గంలో గ్రామీణ రోడ్లు, శ్మశాన వాటికలు అభివృద్ధి చేయనున్నట్టు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. మండలం బిళ్లపాడులో రూ.కోటితో చేపట్టే రహదారి నిర్మాణ పనులకు బుధవారం ఆయన భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో గ్రామ గ్రామానా పర్యటించి స్థితి గతులు తెలుకున్నానని ఎక్కడ అవసరమో అక్కడ రోడ్ల నిర్మాణం చేస్తామన్నారు. మండలంలో 117 సీసీ రోడ్లను రూ.7.5 కోట్లతో నిర్మాణం చేస్తామన్నారు. అలాగే మరో రూ.రెండున్నర కోట్లు ఇతర నిధులు కూడా మంజూరు అయ్యాయన్నారు. రోడ్లు, డ్రెయిన్లు లేకుండా ప్రజలను నానా అవస్థల పాలుచేసిన ఘనత వైకాపాకే దక్కుతుందని రాము విమర్శించారు.



రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

ఎట్టకేలకు ట్యాంకులు శుభ్రం

స్పందనకు వందనం

గన్నవరం మండల పరిధిలోని పల్లెల్లో తాగునీటి ట్యాంకులు నిర్వహణ లేక అధ్వానంగా తయారవడంతో 'ట్యాంకులు శుభ్రపరుస్తున్నారా?' అనే శీర్షికతో సోమవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. తెంపల్లిలోని ట్యాంకులు పరిసరాలను ఆత్కూరు పీహెచ్‌సీకి చెందిన ఎంపీహెచ్ఈవో సీహెచ్ సాంబశివరావు, సూపర్‌వైజర్ నాగమల్లేశ్వరరావు పరిశీలించారు. తాగునీటి పరీక్షలు నిర్వహించి.. ట్యాంకు పరిసరాలను శుభ్రపరిచారు. గ్రామంలో ప్రజారోగ్య వివరాలను ఆరోగ్య కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు.

- గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే, ఈనాడు, కృష్ణా



బ్లీచింగ్ చల్లుతున్న పంచాయతీ సిబ్బంది

దీన్‌దయాళ్ సేవలు చిరస్మరణీయం

మచిలీపట్నం (గొడుగుపేట): పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని భాజపా జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ రాజబాబు అన్నారు. భారతీయ జన సంఘ్ వ్యవస్థాపక సభ్యులు, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ అధ్యక్షుడిగా ఇలా అనేక బాధ్యతలు నిర్వహించి తన ప్రత్యేకత చాటుకున్నారన్నారు. ఏకాత్మతా మానవతావాదం అనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించి జన సంఘ్‌కు సిద్ధాంతాలు లేవన్న వారి నోర్లు మూయించారని పేర్కొన్నారు. భాజపా నియోజకవర్గ కన్వీనర్ సోడిశెట్టి బాలాజీ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సమాజంలో చిట్టచివరి వ్యక్తివరకు చేరాలన్న ఆయన ఆశయమే అంత్యోదయ కార్యక్రమం అన్నారు. నాయకులు పంతం గజేంద్ర, పుప్పాల రాము, ధూళిపాళ్ల శ్రీరామచంద్రమూర్తి, వైవీఆర్ పాండురంగారావు, తోట రంగనాథ్, సీహెచ్ రామకృష్ణ, సూరిశెట్టి హరికృష్ణ, మత్తి వెంకటేశ్వరరావు, మాదిరెడ్డి సతీష్, పద్మావతి, విన్నకోట సుబ్బారావు, వెన్నా ఫణిరాజ్ తదితరులు పాల్గొని నివాళులు అర్పించి ఆయన సేవలను కొనియాడారు.



నివాళులు అర్పిస్తున్న నాయకులు

గుడివాడ గ్రామీణం: భాజపా సిద్ధాంతకర్త పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి ఆ పార్టీ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు యర్రపోతు అర్జున్, జిల్లా కార్యదర్శి అంగడాల సతీష్, పట్టణ ప్రధాన కార్యదర్శి పల్లపోతు మురళీ, కట్కం తిరుపాల్ గుప్తా, చింతపల్లి రాంబాబు, యువమోర్చా నాయకుడు కొత్త కిరణ్‌కుమార్, పి.సాయి రమేష్, పరుచూరి మురళీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

గుడివాడ (గ్రామీణం, న్యూస్‌టుడే: కలెక్టర్ బాలాజీ ఆదేశాల మేరకు స్థానిక ఎస్‌పీఎస్ పురపాలక ఉన్నత పాఠశాలలో కంటి సమస్యలున్న విద్యార్థులకు ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యులు బుధవారం పరీక్షలు నిర్వహించారు. జిల్లా సమ్మిళిత విద్య సమన్వయకర్త రాంబాబు మాట్లాడుతూ అవసరాన్ని బట్టి చిన్నారులకు కళ్లద్దాలు ఇచ్చి శస్త్ర చికిత్సలు చేయడం జరుగుతుందన్నారు. ఎంఐఎస్ సుభాన్, ఏఎస్‌వో నగేష్, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది రెబకా సునందిని, స్మృతి చంద్రమన్న, సినీ జాన్, ప్రకాష్ చందు, జాషువా, కంటి వైద్యురాలు నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ల వాహనానికి ప్రమాదం



నుజ్జయిన ముందుభాగం

పామర్రు రూరల్, న్యూస్‌టుడే: గ్యాస్ సిలిండర్లు రవాణా చేసే వాహనం.. ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొట్టిన ఘటన మంగళవారం అర్ధరాత్రి పామర్రు జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. రాత్రి 12 గంటల సమయంలో విజయవాడ వైపు నుంచి మచిలీపట్నం పోర్టుకు రాతి బండలు లోడుతో లారీ విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారిపై ప్రయాణిస్తోంది. పామర్రు బైపాస్‌లో గల రాయల్ హోటల్ సమీపానికి వచ్చే సరికి వాహనానికి గేర్ బాక్సు వద్ద సమస్య తలెత్తి నిలిచిపోయింది. అదే రూటులో కొండపల్లి నుంచి గ్యాస్ సిలిండర్ల లోడుతో మచిలీపట్నం వైపు వెళ్తున్న లారీ ముందు నిలిచి ఉన్న లారీని ఢీకొట్టింది. దీంతో గ్యాస్ సిలిండర్ల వాహనం ముందు భాగం నుజ్జవగా వాహన డ్రైవర్ జి.దుర్గాప్రసాద్(26) క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. సమాచారం అందుకున్న పామర్రు పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని క్రేన్ సాయంతో డ్రైవర్‌ను బయటకు తీశారు. గాయాలైన అతడిని 108లో మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇదిలా ఉండగా గ్యాస్ సిలెండర్లు గల లారీలో దాదాపు 590 నిండు సిలిండర్లు ఉన్నాయి. వాటిలో ఏ ఒక్కటీ దెబ్బతినకపోవడంతో పెనుప్రమాదం తప్పింది.

మెస్ ఇన్‌ఛార్జిపై దాడి

ఐదుగురిపై కేసు

పెనమలూరు, న్యూస్‌టుడే : కళాశాల మెస్ ఇన్‌ఛార్జిపై దాడి చేసి కొట్టిన ఐదుగురిపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. సుదిమీది రమేష్ అనే వ్యక్తి పెనమలూరులోని ఓ కళాశాలలో మెస్ ఇన్‌ఛార్జిగా పని చేస్తూ అక్కడే ఉంటున్నారు. ఇతనికి భార్యతో ఏర్పడిన వివాదాల కారణంగా ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు పోలీస్‌స్టేషన్‌లో కొంతకాలం క్రితం కేసు నమోదైంది. దీంతో రమేష్ తనపై కేసు నమోదు చేయించడానికి వెనుక అదే గ్రామానికి చెందిన పలువురి ప్రమేయం ఉందని అనుమానిస్తూ వారిని తరచూ తిడుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 23 వేకువజామున నాగులుప్పలపాడుకు చెందిన గోగినేని చంద్ర, చెన్నుపాటి శరత్, నల్లూరి సతీష్, జాలాది వెంకటేష్, కందమళ్ల శరత్ ఇతను పని చేస్తున్న కళాశాలకు వచ్చి ఇతనిపై దాడి చేసి తీవ్రంగా కొట్టారు. ఈ క్రమంలో రమేష్‌కు బలమైన గాయాలవడంతో చికిత్స పొందుతూ పెనమలూరు పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. దీంతో దాడికి పాల్పడ్డ వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సూపర్‌సిక్స్ పథకాల అమలుకు డిమాండ్



పళ్లాలు మోగిస్తూ కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపేందుకు వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు

కలెక్టరేట్ (మచిలీపట్నం), న్యూస్‌టుడే: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను తక్షణం అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. హామీల అమలులో ప్రభుత్వ వైఫల్యాన్ని ఖండిస్తూ పార్టీ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు బుధవారం కలెక్టరేట్ వద్ద థాలీ బజావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు గొల్లు కృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయినా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా గాలికొదిలేశారని విమర్శించారు. ఒక్క పింఛను మినహా చదువుకునే పిల్లలకు రూ.15వేలు, ఉచిత గ్యాస్, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రైతులకు, మహిళలకు ప్రకటించిన వరాల్లో ఏ ఒక్కటీ అమలుకు నోచుకోలేదన్నారు. నాయకులు అబ్దుల్‌మతీన్, శొంఠి నాగరాజు, వి.సుబ్రమణ్యం, ఫణిభూషణ్, శామ్యూల్, చిలుకోటి ప్రసాద్, పలువురు కార్యకర్తలు ధర్నా చౌక్ నుంచి కలెక్టరేట్ వరకూ పళ్లాలు మోగిస్తూ ర్యాలీ నిర్వహించారు.

జిల్లా రవాణాశాఖ కార్యాలయం మార్పు

మచిలీపట్నం (కోనేరుసెంటరు): జిల్లా రవాణాశాఖాధికారి కార్యాలయాన్ని మాచవరంలోని జోస్యులవారితోటకు మారుస్తున్నట్లు రవాణా అధికారి పురేంద్ర తెలిపారు. ప్రస్తుతం నోబుల్ కళాశాల రోడ్ లక్ష్మణరావుపురంలో ఉన్న కార్యాలయాన్ని మాచవరం మార్చే విషయంలో ఎవర్నికైనా అభ్యంతరాలు ఉంటే వారం వ్యవధిలో తెలియజేయాలని ఆయన ఓ ప్రకటన ద్వారా కోరారు.

మచిలీపట్నం

•మచిలీపట్నం •పెడన

ఆసుపత్రిలో వైద్య విద్యార్థుల సేవలు


ద్వితీయ సంవత్సర విద్యార్థులు..

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: మచిలీపట్నం ప్రభుత్వ వైద్య కళాశాలలో మొదటి సంవత్సరం పూర్తి చేసుకుని ద్వితీయ సంవత్సరంలోకి ప్రవేశించిన ఎంబీబీఎస్ విద్యార్థులు బుధవారం నుంచి సర్వజన ఆసుపత్రిలో సేవలు అందించేందుకు సిద్ధమయ్యారు. మొత్తం 138 మంది విద్యార్థులు వారి విద్యాభ్యాసంలో భాగంగా ఇకపై ఉదయం పూట ఆసుపత్రిలో రోగులకు సేవలు అందిస్తారని, మధ్యాహ్నం కళాశాలలో తరగతులకు హాజరవుతారని ఆసుపత్రి వైద్యాధికారులు తెలిపారు.

హిందువుల మనోభావాలు దెబ్బతీయొద్దు


మాట్లాడుతున్న బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు

మచిలీపట్నం (కోనేరుసెంటరు), న్యూస్‌టుడే: అధికారం చేపట్టిన నాటి నుంచి వైకాపా ప్రభుత్వం హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరించిందని బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు విమర్శించారు. పరాసుపేటలోని బ్రాహ్మణ సేవా సంఘం కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆ సంఘం ఉపాధ్యక్షుడు ఏఆర్కే మూర్తి, ప్రధాన కార్యదర్శి వింజమూరి శివరాం, తదితరులు మాట్లాడారు. దీనిపై సీబీఐతో సమగ్ర విచారణ చేయించాలని కోరారు. నాయకులు మోపర్తి సుబ్రమణ్యం, సత్యనారాయణశర్మ, పీవీ ఫణికుమార్, మారుతి దివాకర్, తదితరులు పాల్గొన్నారు.

కల్తీకి పాల్పడిన వారిని శిక్షించాలి

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: తిరుపతి లడ్డూలో కల్తీ నెయ్యి కలిపి మహాపాపానికి ఒడిగట్టిన వారిని కఠినంగా శిక్షించాలని రాధారంగా మిత్రమండలి అధ్యక్షుడు బుల్లెట్ ధర్మారావు డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని గొడుగుపేట కూనపరెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైకాపా హయాంలో గత ఐదేళ్లలో తిరుపతిని అపవిత్రం చేశారని ఆరోపించారు. నాయకులు ధూళిపాళ్ల శ్రీరామచంద్రమూర్తి, హరికృష్ణ, విన్నకోట సుబ్బారావు, వన్నెంరెడ్డి ప్రసాద్, జరుగు వెంకటసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

చేనేత జౌళిశాఖ ఏడీగా సాయిప్రసాద్


సాయిప్రసాద్‌ని అభినందిస్తున్న వీవర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు

పెడన: చేనేత జౌళి శాఖ ఏడీగా సాయిప్రసాద్ బుధవారం నియమితులయ్యారు. శ్రీకాకుళం ఏడీగా పనిచేస్తూ బదిలీపై కృష్ణాకు వచ్చారు. ఇక్కడ ఏడీగా పనిచేస్తున్న అప్పారావును ప.గో జిల్లాకు బదిలీచేశారు. సాయిప్రసాద్‌ను ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నందిగామ సర్పంచిగా హరిబాబు

పెడన: పెడన మండలం నందిగామ సర్పంచి బొడ్డు చినబాబు అలియాస్ సీతయ్యను ఆ పదవి నుంచి తప్పించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. అలాగే సర్పంచిగా బొడ్డు హరిబాబును నియమించాలని ఆ ఆదేశాల్లో పేర్కొన్నారు. ఈ ఆదేశాలు తక్షణం అమల్లోకి వస్తాయని ఎంపీడీవో రెడ్డియ్య చెప్పారు. సర్పంచి చినబాబు ఎన్నిక చెల్లదని సర్పంచిగా పోటీ చేసి ఓటమి పొందిన బొడ్డు హరిబాబు మచిలీపట్నం జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో గతేడాది పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై వాదప్రతివాదనల అనంతరం కోర్టు చినబాబును అనర్హుడిగా ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో హరిబాబు ఆ బాధ్యతలను చేపట్టారు. దీనిపై చినబాబు హైకోర్టు స్టే పొంది తిరిగి ఆ బాధ్యతలను కొద్ది రోజుల్లోనే చేపట్టారు. హైకోర్టు స్టే కాలం ఈ ఏడాది జూన్ 25తో పూర్తవడంతో హరిబాబును తిరిగి సర్పంచిగా నియమిస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. సర్పంచి చినబాబు అందుబాటులో లేకపోవడంతో ఇంటికి నోటీసు అంటించామని ఎంపీడీవో చెప్పారు. హరిబాబుతో తిరిగి ప్రమాణ స్వీకారం చేయించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

తాత్కాలిక కల్వర్టు నిర్మాణ పనులు ప్రారంభం

తాళ్లపాలెం (మచిలీపట్నం రూరల్), న్యూస్‌టుడే: తాళ్లపాలెం శివారు పల్లెతాళ్లపాలెంలో పంట కాలువపై కూలిపోయిన కల్వర్టు స్థానంలో తాత్కాలిక కల్వర్టు నిర్మాణ పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. సుమారు రూ.2లక్షల ఖర్చుతో కల్వర్టును యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశాలతో తాత్కాలిక కల్వర్టును గురువారం నాటికి పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామని పంచాయతీరాజ్ ఏఈ జవహర్ తెలిపారు.

పీఆర్ ఏఈగా ధర్మయ్య

పెడనగ్రామీణం, న్యూస్‌టుడే: పెడన మండల పీఆర్ ఏఈగా ధర్మయ్య నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం పామర్రులో ఏఈగా పని చేస్తున్నారు. గూడూరు ఏఈగా, పెడన ఇన్‌ఛార్జి ఏఈగా పని చేస్తున్న లోయ హరిబాబు మచిలీపట్నానికి బదిలీ అయ్యారు. ఏఈ హరిబాబు త్వరలో రిలీవ్ కానున్నట్లు మండల పరిషత్తు వర్గాలు తెలిపాయి.

గర్భిణులకు సామూహిక సీమంతాలు


ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సీమంతాలు చేస్తున్న అధికారులు

ఎస్.ఎన్.గొల్లపాలెం (మచిలీపట్నంగ్రామీణ), న్యూస్‌టుడే: పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా బుధవారం ఎస్.ఎన్.గొల్లపాలెంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఐసీడీఎస్ బందరు సెక్టార్ సూపర్‌వైజర్ జి.విజయకుమారి గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం గురించి, పిల్లల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. సీమంతం కార్యక్రమానికి చీరలను కౌన్సిలర్ సుబ్రహ్మణ్యం, కొనకళ్ల మధు, కొల్లూరి సురేష్, తలారి రవిశంకర్ సమకూర్చారు. వెల్ఫేర్ కార్యదర్శి అనుపమ బహుమతులు సమకూర్చారు. మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, మాజీ జడ్పీటీసీ నారాయణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కంటి సమస్యలు ఉన్న విద్యార్థుల గుర్తింపు

పెడనగ్రామీణం, న్యూస్‌టుడే: మచిలీపట్నంలో ఎస్ఎస్ సహిత విద్య, ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో మంగళవారం కంటి చూపు, అంధత్వ సమస్యలు ఉన్న విద్యార్థులను గుర్తించారు. జిల్లాలో ఐఈఆర్పీ ఉపాధ్యాయులు 24 మంది విద్యార్థుల్ని గుర్తించి వారి సమస్యలు తెలుసుకున్నట్లు సహిత విద్య జిల్లా సమన్వయకర్త శ్రీకాకుళపు రాంబాబు తెలిపారు. గుడివాడలో డాక్టర్లు కిరణ్, సునందిని, స్మృతి చంద్రమన్న, ప్రకాష్, చందు, జాషువా తదితరులు శిబిరాన్ని నిర్వహించి పిల్లల్లో కంటి సమస్యల్ని గుర్తించినట్లు పేర్కొన్నారు.

సినిమాలు

రేవతి- చిక్‌లెట్స్, **మినీ రేవతి-** నరబలి, **సిరికృష్ణ:** భలే ఉన్నాడే, **సిరివెంకట్:** మత్తువదలరా 2, **రామరాజు:** సరిపోదా శనివారం – మచిలీపట్నం కార్పొరేషన్

ప్రగతి పనులు.. చిగురించిన ఆశలు

ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో చేపట్టేలా ప్రతిపాదనలు

న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్

వైకాపా హయాంలో నగరంలో అభివృద్ధి కుంటుపడిపోవడంతో పాటు గత తెదేపా ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులు కూడా పూర్తి చేయకుండా వదిలేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వ్యవస్థను గాడిలోపెట్టి నగరాన్ని అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగానే సీఎస్ఆర్ నిధులతో పలు పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు చేసిన విషయం తెలిసిందే. తాజాగా ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో నగరంలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు కార్యాచరణ చేపట్టారు. దీనికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ ప్రతినిధులు నగరంలోని వివిధ ప్రాంతాలను పరిశీలించి వెళ్లడంతో నగర అభివృద్ధిపై ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి.


కమిషనర్‌తో మాట్లాడుతున్న ఏపీ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ ప్రతినిధులు

భవనం పనుల్లో జాప్యం..

నగరపాలక సంస్థ కార్యాలయానికి రూ.5కోట్లకు పైగా వెచ్చించి నూతన భవనం నిర్మించడానికి గత తెదేపా ప్రభుత్వ హయాంలో చర్యలు తీసుకున్నారు. దీనిలో భాగంగానే మచిలీపట్నం రైల్వేస్టేషన్ ప్రాంతంలో రిజర్వాయర్ ప్రాంగణంలో భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. పునాదుల దశకు వరకు చేరిన తరువాత నిధుల విడుదలలో జరిగిన జాప్యంతో పనులు ఆగిపోయాయి. అసంపూర్తిగా పనులు నిలిచిపోయి ఎనిమిదేళ్లు కావస్తున్నా ఇంతవరకు వాటి గురించి పట్టించుకున్నవారు లేరు. వైకాపా ప్రభుత్వం కూడా పట్టించుకోకుండా వదిలేసింది. ప్రస్తుతం అక్కడ చేపట్టిన పనులు కూడా పాడైపోతున్నాయి.

ఆదాయం సమకూరేలా ..

పట్టణం నగరపాలక సంస్థగా వర్గోన్నతి పొందిన తరువాత అయినా పనులు పూర్తి చేస్తారేమోనని అందరూ భావించారు. కానీ వైకాపా పాలకులు దాని గురించి కూడా పట్టించుకోకుండా మీసేవా కేంద్రం ఉండే భవనానికి రూ.లక్షలు వెచ్చించి కౌన్సిల్ సమావేశ మందిరంగా మార్చారు. ప్రస్తుతం ఈ భవనాన్ని ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో జీప్లస్ 5 భవనం నిర్మించి అందులోనే వాణిజ్య సముదాయాలు కూడా ఉండేలా ప్రతిపాదనలు చేశారు. ఇలా చేయడం వల్ల నగరపాలక సంస్థకు భవనం ఏర్పడడంతో పాటు వాణిజ్య సముదాయం కారణంగా ఆదాయం కూడా వస్తుందని భావించి ఆ దిశగా ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించారు.


జడ్పీ కూడలిలో సోలార్ ప్యానల్స్ ఏర్పాటుకు ప్రతిపాదించిన చెరువు


అసంపూర్తిగా నగరపాలక సంస్థ భవనం

ప్రతిపాదనలు ఇవే..

◆ నగరపాలకసంస్థ భవనంతోపాటు పలు అభివృద్ధి పనులకు చేపట్టాలని నిర్ణయించారు. జడ్పీ కూడలిలో ఉన్న చెరువు వద్ద సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు చేశారు. అమృత్ పథకంలో ఈ చెరువును పర్యాటకంగా అభివృద్ధి చేసే దిశగా చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే. ఇక్కడ సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసి వాటి నుంచి వచ్చే విద్యుత్తును నగరానికి వినియోగించుకోవాలని నిర్ణయించారు. మూడుస్తంభాల కూడలి వద్ద ఉన్న పంపుల చెరువు వద్ద కూడా ఈ సోలార్ ప్యానల్స్ అమర్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ◆ హౌసింగ్ బోర్డు కాలనీ ప్రాంతంలోని నగరపాలక సంస్థ స్థలంలో బాక్స్ క్రికెట్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించారు.

మంత్రి ఆదేశాల మేరకు..

- బాపిరాజు, నగరపాలక సంస్థ కమిషనర్

ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో నగరంలో పలు అభివృద్ధి పనులు చేపట్టే క్రమంలో ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ ప్రతినిధులు విజయ్, సుధీష్‌లు ఇటీవల వచ్చి వివిధ ప్రాంతాలను పరిశీలించి వెళ్లారు. ఏయే ప్రాజెక్టులు చేపట్టాలని ప్రతిపాదించామో వాటిని పరిశీలించి వెళ్లారు. మంత్రి రవీంద్ర ఆదేశాల మేరకు అవసరమైతే మరిన్ని ప్రాజెక్టులు చేపట్టేందుకు కృషి చేస్తున్నాం.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని సంఘ కార్యాలయంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. రాజమహేంద్రవరం గౌతమి నేత్రాలయం వైద్యులు రాజు, సిబ్బంది కంటి పరీక్షలు చేశారు. పలువురికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించినట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు కారుమూరి రాజేంద్రప్రసాద్ తెలిపారు. ప్రతినెలా రెండు, నాలుగో బుధవారాల్లో నేత్ర శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రైతులకు చేరువగా వ్యవసాయ సాంకేతికత


క్షేత్ర సందర్శనలో వ్యవసాయాధికారులు, తెలుగు రైతు అధ్యక్షుడు

పెదపట్నం (మచిలీపట్నం రూరల్): వ్యవసాయ ఆధునిక సాంకేతికతను రైతులకు చేరువ చేయడమే పొలం పిలుస్తోంది లక్ష్యాలలో ఒకటని మచిలీపట్నం ఏఓ హారిక అన్నారు. పెదపట్నం గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రైతులకు వ్యవసాయ అనుబంధ శాఖల పథకాలపై అవగాహన కల్పించారు.

యాజమాన్య పద్ధతితో పంటను కాపాడుకోండి: చినపాండ్రాక(కృత్తివెన్ను): రైతులంతా యాజమాన్య పద్ధతి పాటించి, పంటలను చీడపీడల నుంచి కాపాడుకోవచ్చని ఏఓ ఎస్.జెన్నీ అన్నారు. మండలంలోని చినపాండ్రాకలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరి పొలాలను పరిశీలించి, రైతులకు సూచనలు చేశారు. బంటుమిల్లి ఏడిఏ బి.గౌతమ్, వీఎఫ్ఏ చక్రవర్తి, గోవింద్, వాసు, రాజేష్, అశ్విని, వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి అవసరం


మాట్లాడుతున్న ఎంపీపీ మధుసూదనరావు

గూడూరు, న్యూస్‌టుడే: మండలంలోని ఆయా గ్రామాల్లో పరిశుభ్రత కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ సంగా మధుసూధనరావు అన్నారు. బుధవారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీల్లో సిబ్బంది సమన్వయంతో ఉంటూ స్వచ్ఛత కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతం చేయాలన్నారు. ఆయనతో పాటు జడ్పీటీసీ సభ్యులు వేముల సురేష్ తదితరులు మాట్లాడారు. పలువురు వైకాపాకు చెందిన ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో అంతర్గత రోడ్లు, తదితర అభివృద్ధి పనులు చేపడుతున్నారని, వాటిని ఎంపిక చేసే విషయంలో సర్పంచులకు తెలియజేయడం లేదన్నారు. దీనిపై తెదేపాకు చెందిన ఆకులమన్నాడు సర్పంచి మహ్మద్ రఫీ మాట్లాడుతూ వైకాపా హయాంలో తాను అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నానన్నారు. సర్పంచిగా తాను ఉంటే పిలవకుండా గ్రామంలో అనేక కార్యక్రమాలు నిర్వహించారని వారికి సమాధానమిచ్చారు. ఇన్‌ఛార్జి ఎంపీడీవో రాజేశ్వరి మాట్లాడుతూ ప్రజల సమస్యలు తెలుసుకుని వారి సూచనల మేరకు అభివృద్ధి పనులు చేపడతామన్నారు. ఉప ఎంపీపీలు నేతల కుటుంబరావు, పిచ్చుక గంగాధరరావు, తహసీల్దారు డి.రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు ఉద్యోగులకు స్థానచలనం

పెడన, మచిలీపట్నంరూరల్: విద్యుత్తుశాఖ పెడన సెక్షన్ కార్యాలయంలో పనిచేస్తున్న లైన్‌మెన్, సహాయ లైన్‌మెన్‌లను బదిలీ చేస్తూ బుధవారం మచిలీపట్నం ఈఈ ఎం.భాస్కర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ బదిలీ.. : పెడన, గూడూరు మండలాల ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ హేమస్రవంతి గొల్లపూడిలోని ఆ శాఖ ప్రధాన కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆ స్థానంలో మచిలీపట్నం నుంచి జి.నాగరాజును నియమించారు. ❖ మచిలీపట్నం మండలంలో 17 మంది వీఆర్వోలు తాజాగా బదిలీ అయ్యారు.

యూనియన్ బ్యాంకు ఉద్యోగుల సమ్మె విరమణ

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: తమ డిమాండ్ల సాధనలో భాగంగా యూనియన్ బ్యాంకు ఉద్యోగులు ఈ నెల 27 నుంచి చేపట్టనున్న సమ్మె విరమించినట్లు సంఘ నాయకులు ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ డిమాండ్లపై 60 రోజుల్లోగా పరిష్కరించే విధంగా కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో తాత్కాలికంగా సమ్మె విరమించినట్లు పేర్కొన్నారు. బ్యాంకు అధికార సంఘం నాయకులు డి.రాజేష్‌బాబు, బి.యోహాను, వినీల్, ఉద్యోగ సంఘ నాయకులు వి.శ్రీనివాస్, దుర్గారావు, సలామ్, వాణి, ఉదయ్ తదితరులు ప్రకటన విడుదల చేసిన వారిలో ఉన్నారు.

వంద రోజుల ప్రగతి పాలన


రోడ్డు నిర్మాణ పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాగిత, బూరగడ్డ వేదవ్యాస్ తదితరులు


పెదపట్నంలో కరపత్రాలు చూపుతున్న తెదేపా నాయకులు


ఎస్.ఎన్.గొల్లపాలెంలో..

గూడూరు, న్యూస్‌టుడే: ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడంతో పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేదిశగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం మల్లవోలులో ఏర్పాటు చేసిన ప్రజావేదికలో ఆయన మాట్లాడారు. సంక్షోభ సమయంలోనూ సంక్షేమాన్ని అందించడంతో పాటు మొదటి 100 రోజుల్లోనే ప్రజల చేత మంచి ప్రభుత్వం అనిపించుకుందన్నారు. దీపావళి నాటికి మహిళలకు మూడు ఉచిత సిలిండర్ల పథకం అమల్లోకి వస్తుందన్నారు. తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షులు బూరగడ్డ వేదవ్యాస్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బి.కిషన్‌తేజ్, మండల అధ్యక్షుడు పి.లక్ష్మీనరసింహస్వామి, కూటమి నాయకులు హరిరామకృష్ణ, గోపి, నాగబాబు, ఉమాసాయిరామ్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం మల్లవోలులో రూ.12లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టనున్న రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

పడతడిక(కృత్తివెన్ను), న్యూస్‌టుడే: పడతడికలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వ పథకాలను వివరిస్తూ ప్రజలకు కూటమి శ్రేణులు కరపత్రాలు పంపిణీ చేశారు. పడతడిక తెదేపా అధ్యక్షుడు పాలపర్తి ప్రకాష్, బొర్రా మురళీకృష్ణ, కూటమి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

మచిలీపట్నంరూరల్, న్యూస్‌టుడే: పెదపట్నం, కానూరు గ్రామాల్లో ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు కుంచె నాని, క్లస్టర్ ఇన్‌ఛార్జి లంకే శేషగిరి, సోమశేఖర్, నాగేశ్వరరావు, రవి, కొనకళ్ళ నాగరాజు, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

మచిలీపట్నంరూరల్, న్యూస్‌టుడే: ప్రజలకు పలు సంక్షేమ పథకాలను అందిస్తున్న ప్రభుత్వమిదని మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం భోగిరెడ్డిపల్లి, నెలకుర్రు, ఎస్.ఎన్.గొల్లపాలెం గ్రామాల్లో తెదేపా నాయకులు ఇంటింటికి తిరిగి కరపత్రాలు అందజేశారు.


పడతడికలో కరపత్రాలు పంచుతున్న పాలపర్తి ప్రకాష్ తదితరులు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పెడన, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరు తమ సామాజిక బాధ్యతగా గుర్తించాలని మున్సిపల్ కమిషనర్ మన్నం గోపాలరావు అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక 18వ వార్డులో అవగాహన కల్పించారు. కార్మికులకు ఆరోగ్యశ్రీ పథకంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. కౌన్సిలర్ ప్రసాద్, ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోపీ కిషోర్, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

రాయవరం (గూడూరు), న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించారు. సంస్థ ప్రధాన కార్యదర్శి గోవాడ ప్రశాంతి, పాఠశాల హెచ్‌ఎం ఎ.విజయ తదితరులు మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే పరిశుభ్రత ఆవశ్యకతపై అవగాహన పెంపొందించుకోవాలని అన్నారు. ఉపాధ్యాయులు డి.శారదాదేవి, పి.కరుణజ్యోతి, ఎం.రత్నమణి, టి.కుమార్ తదితరులు పాల్గొన్నారు

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: ప్రకృతి సమతుల్యతతోనే జీవి మనుగడ సాధ్యమని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ రోజారమణి అన్నారు. కళాశాల జాతీయ సేవా పథక విభాగం ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ వైద్య కళాశాలలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వరలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


పెడన: 18వ వార్డులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, కార్మికులు


విద్యార్థుల మానవహారం



మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

గత పాలకుల నిర్లక్ష్యం.. ప్రజలకు శాపం

న్యూస్‌టుడే, బంటుమిల్లి

గత వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రజలకు, వాహన చోదకులకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. సకాలంలో రోడ్లకు మరమ్మతులు చేయకపోవడంతో చాలాచోట్ల గ్రామాలను కలిపే ప్రధాన రహదారులు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. మండలంలోని పెదతుమ్మిడి నుంచి ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలంలోని వైవాక మీదుగా కలిదిండి మండలం కోరుకొల్లు చేరుకొనే ప్రధాన రహదారి దుస్థితి ఇది. సుమారు 15 కిలోమీటర్లు ఉన్న ఈ రహదారిని 2014-2019లో నాటి తెదేపా ప్రభుత్వం నిర్మించి, పలు మార్లు దెబ్బతిన్న చోట్ల మరమ్మతులు చేయించింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం ఈ రోడ్డును పట్టించుకోవడమే మానేసింది. దీంతో కూటమి ప్రభుత్వంపై జనం ఆశతో ఉన్నారు.


పెదతుమ్మిడి, వైవాక రహదారి దుస్థితి

రహదారితో తప్పని తిప్పలు: పెదతుమ్మిడి - కోరుకొల్లు ప్రధాన రహదారి వెంబడి ఆయా గ్రామాల్లోని ప్రజలు రోజూ ఇతర ప్రాంతాలకు వారి అవసరాల కోసం రాకపోకలు సాగిస్తుంటారు. రహదారి ఇలా ఉండడంతో ఏ వాహనాలు రావడం లేదు. పలుమార్లు 108 వంటి వాహనాలు రావడానికి కూడా వీలు లేక జబ్బుపడిన రోగులు తీవ్ర ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. రాత్రివేళ ప్రయాణించేవారి బాధ వర్ణణాతీతంగా ఉంది. ఎక్కడ గుంత ఉందో కూడా తెలియని పరిస్థితి నెలకొంది.


పెదతుమ్మిడిలో చెరువు, రోడ్డు కలిసిపోయి ఇలా..


పెదతుమ్మిడి- కోరుకొల్లు దారి ఇలా..

గుడివాడ

•గుడివాడ •పామర్రు •అవనిగడ్డ

అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం



కూచిపూడి: కరపత్రాలను ప్రదర్శిస్తున్న తెదేపా నాయకులు, సర్పంచి, కార్యదర్శి



పెదపారుపూడి: పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం చేస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

పెదపారుపూడి, కూచిపూడి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. బుధవారం పెదపారుపూడి మండలం వెంట్రప్రగడలో గల ఆర్యవైశ్య కల్యాణ మండపంలో 'మన మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికు లను సత్కరించారు. తెదేపా మండల అధ్యక్షుడు చలసాని రమేష్‌చౌదరి, కార్యదర్శి మసిముక్కు రాంబాబు, గొరిపర్తి రవికుమార్, మాజీ ఎంపీపీ పునుకొల్లు వెంకటరత్నప్రసాద్, తాడిశెట్టి నరేష్, తహసీల్దార్ రంగారావు, ఎంపీడీవో సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

☛ మొవ్వ మండలం కూచిపూడి పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచి కొండవీటి ఆధ్వర్యంలో ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. తెదేపా మండల కార్యదర్శి వీరంకి తులసీరామ్, పంచాయతీ కార్యదర్శి భవాని, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

కొనకళ్లకు అభినందన



కొనకళ్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

కూచిపూడి, అవనిగడ్డ గ్రామీణం, అవనిగడ్డ, పామర్రు, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం కొనకళ్లకు సముచిత స్థానం కల్పించడం హర్షణీయమని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, వర్ల కుమార్‌రాజాలు అన్నారు. బుధవారం ఆయనను కలిసి అభినందనలు తెలిపారు. పామర్రు జనసేన ఇన్‌ఛార్జి తాడిశెట్టి నరేష్, రాష్ట్ర బీసీ నాయకుడు కొనకళ్ల జగ న్నాథం(బుల్లయ్య), మండలి వెంకట్రామ్, పామర్రు నియోజకవర్గ తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ★ అవనిగడ్డ మండలం పులిగడ్డ ఉప సర్పంచి మండలి వెంకటేశ్వరరావు, పెద్దలు బంకు నిర్వాహకులు మండలి దినేష్‌లు కొనకళ్లను సత్కరించి అభినందనలు తెలిపారు.

చినగొన్నూరు(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: మండలంలోని చినగొన్నూరుకు చెందిన జడ్పీ మాజీ వైస్ చైర్మన్, శాయన పుష్పావతి-సూర్యప్ర సాదరావు దంపతులు.. ఆర్టీసీ ఛైర్మన్‌గా నియమి తులైన జిల్లా పార్టీ అధ్యక్షుడు కొనకళ్ల నారాయ ణరావును బుధవారం మచిలీపట్నంలోని ఆయన స్వగృహంలో కలిసి అభినందనలు తెలిపారు.

పంట నష్టపరిహారం విడుదల

అవనిగడ్డ సబ్ డివిజన్‌లో రూ.409.61 లక్షలు మంజూరు



అవనిగడ్డ: పంట నష్టం అంచనాలు వేస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు(పాత చిత్రం)

అవనిగడ్డ, న్యూస్‌టుడే: ఈ ఏడాది ఆగస్టు, సెప్టెంబర్‌లో కురిసిన వర్షాలకు, వర దలకు దెబ్బతిన్న వరి పైరుకు ప్రభుత్వం నష్ట పరిహారం విడుదల చేసింది. అవనిగడ్డ వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ పరిధి 4 మండలాల్లో 3,808 మంది రైతులు 2,038. 92 హెక్టార్లలో పంట నష్ట పోయినట్లు అధి కారులు గుర్తించారు. అనంతరం ప్రభుత్వం రూ. 409. 61 లక్షలు ప్రభుత్వం విడుదల చేసినట్లు ఏడీఏ జయ ప్రద తెలిపారు.

మండలాల వారీగా వివరాలు ఇలా

మండలం -	రైతుల సంఖ్య	విస్తీర్ణం (హెక్టార్లలో	మంజూరైన సబ్సిడీ (రూ.లక్షల్లో)
అవనిగడ్డ	132	75.31	రూ. 18.08
కోడూరు	2,068	1,120.47	రూ. 180.12.
మోపిదేవి	732	370.09	రూ. 92.43
నాగాయలంక	876	473.05	రూ.118.26

శ్రీవారి లడ్డూ కల్తీ అమానుషం

అవనిగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీ చేయడం అమానుష చర్యయని వేకనూరులోని వెంక టేశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు దీవి కృష్ణమాచార్యులు అన్నారు. బుధవారం ఆలయంలో సంప్రోక్షణ, ప్రక్షాళన, శ్రీవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తిరుపతి ఆలయంలో గతంలో జరిగిన ఇటువంటి దుర్ఘటనలు జరగలేదని అన్నారు. అర్చకులు మంటసాల వెంకటేశ్వరశర్మ, డీవీకే సత్యప్రసాద్, భక్తులు పాల్గొన్నారు

ఉద్యోగులకు బదిలీలు

గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే: స్థానిక మండల రెవెన్యూ సర్వేయర్ రామకృష్ణ పామర్రుకు, పామర్రు నుంచి పర్యవేక్షల్‌నాగ ఇక్కడకు, అలాగే కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ రాజశే ఖర్ గుడివాడ ఆర్డీవో కార్యాలయానికి, ఏలూరు జిల్లా ముదినేపల్లి నుంచి పొట్లూరి శివకుమార్ ఇక్కడకు బదిలీపై వచ్చారు. మండలం నుంచి 8 మంది వీఆర్వోలు బదిలీలు కాగా ఇక్కడకు ఐదు గురు వస్తున్నారు, ఇంకా నాలుగు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. మండల పరిషత్ పరిధిలో నలుగురు గ్రేడ్-1 కార్యదర్శులతో సహా 11 మంది, ఇంకా పంచాయతీ, ఎంపీడీవో కార్యా లయం నుంచి ఐదుగురు, ఈవోపీఆర్డీలు బదిలీ అయ్యారు. వీరందరిని అక్టోబరు 3న రిలీవ్ చేయాలని సీఈవో ఆదేశాలు జారీ చేశారు.

ఎమ్మెల్యేకు సత్కారం

అవనిగడ్డ, న్యూస్‌టుడే: మోపిదేవి సుబ్రహ్మ ణ్యేశ్వరస్వామి ఆలయ ఈవో శ్రీరామ వరప్రసా దరావు.. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. ఇటీవల జరి గిన బదిలీల్లో ఆయనను చల్లపల్లి ఎస్టేట్ దేవా లయాల ఈవోగా నియమించారు. బాధ్య తలు స్వీకరించిన సందర్భంగా ఎమ్మెల్యేను కలి శారు. మండలి వెంకట్రామ్ పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతాలు

చల్లపల్లి, న్యూస్‌టుడే: చల్లపల్లి మండలం లక్ష్మీపురం సచివాలయం-2లో ఐసీడీఎస్ ఆధ్వ ర్యంలో పోషణ అభియాన్ వారోత్సవాల్లో భాగంగా గర్భిణులకు పోషకాహారంపై అవగాహన కల్పించి సీమంతం చేశారు. లక్ష్మీపురం సర్పంచి కోటేశ్వరరావు, సూపర్‌వైజర్ విజ్ఞానమ్మ, అధికా రులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమ నిర్మాణానికి సిమెంటు బస్తాల వితరణ

చల్లపల్లి, న్యూస్‌టుడే: స్థానిక నిమ్మలతోట లోని సాయిసేవా వృద్ధాశ్రమం ఆవరణలో నూతన ఆశ్రమ భవన నిర్మాణానికి విజయవా డకు చెందిన పంటా రామకృష్ణ, సత్యవాణి దంపతులు 100 సిమెంటు బస్తాలు వితరణగా అందజేశారు. గ్రామస్థుడు దోనేపూడి రవిశంక ర్ ద్వారా ఆశ్రమ నిర్వాహకులు శీలం భాస్కర రావుకు అందించారు.

గోకులం.. పశుపోషకులకు వరం

నాగాయలంక, పామర్రు గ్రామీణం, న్యూస్‌టుడే

గ్రామీణ ప్రాంతాల్లో పశువులు, జీవాలకు పోషకులు చిన్నచిన్న పాకలు వేస్తారు. కానీ అక్కడ సరైన ఏర్పాట్లు ఉండవు. ఎండ, వర్షం, చలికి అవి ఇబ్బంది పడుతున్నాయి. వ్యాధులు ప్రబలి విలువైన పశువులు మృత్యు ఒడికి చేరుతున్నాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం మినీ గోకులాల నిర్మాణా నికి రాయితీలు అందిస్తూ పాడి పరిశ్రమను అభివృద్ధి చేసే దిశగా అడుగులు వేస్తోంది. గతంలో తెదేపా అధికారంలో ఉన్నప్పుడు మినీ గోకులాల పేరుతో పాడి రైతులకు లబ్ధి చేకూరేలా చర్యలు చేపట్టింది. అనంతరం వైకాపా ప్రభుత్వం ఐదేళ్లు వీటిని గాలి కొది లేసింది. ఇటీవల కూటమి ప్రభుత్వం షెడ్ల నిర్మించేందుకు మండలాల వారీగా లక్ష్యాలు నిర్దేశించింది. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చర్యలు చేపట్టడంతో పశు పోషకుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.



నంగేగడ్డలో నిర్మించిన షెడ్డు

సద్వినియోగం చేసుకుంటే ప్రయోజనం

★ దరఖాస్తుతో పాటు ఆధార్, జాబ్ కార్డు, షెడ్ల నిర్మాణం చేపట్టే భూమి రిజిస్ట్రేషన్ పత్రాలు, బ్యాంకు పాసు పుస్తకం నకలు సమర్పించాల్సి ఉంటుంది. ★ మండలానికి 50 చొప్పున గోకులం యూనిట్లు మంజూరు చేసినట్లు పశు వైద్యాధికారులు చెబుతున్నారు.

అర్హతలు.. నిబంధనలు

★ గోకులం పథకం కింద షెడ్ల నిర్మాణానికి పశువుల పెంపకందారులకు 90 శాతం, గొర్రెలు, మేకలు, కోళ్ల పెంప కందారులకు 70 శాతం చొప్పున రాయితీలు కల్పిస్తారు. ★ ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డు ఉన్న చిన్న, సన్న కారు రైతులు ఈ పథకానికి అర్హులు. సంబంధిత దరఖా స్తులు రైతు సేవా కేంద్రం, మండల వ్యవసాయ శాఖ కార్యాలయం, పశు వైద్యశాలల్లో అందుబాటులో ఉంటాయి.

త్వరలో ప్రారంభం..:

మండలంలో ఇప్పటికే గోకులాల లబ్ధి దారుల ఎంపిక ప్రక్రియ ప్రారంభ మైంది. ఎంపిక చేసిన తరువాత దర ఖాస్తులను ఎన్ఆర్ఈజీఎస్ అధికారులకు పంపిస్తాం. త్వరలో నిర్మాణాలు మొద లయ్యే అవకాశం ఉంది.

- సీహెచ్ మౌనిక, పశువైద్యాధికారిణి, నాగాయలంక

అందించే నిధుల వివరాలు ఇలా..

షెడ్లు పరిధి	యూనిట్ విలువ	రాయితీ (రూపాయల్లో)	రైతు వాటా
2 పశువులు	1,15,000	1,03,500	11,500
4 పశువులు	1,85,000	1,66,500	18,500
6 కన్నా ఎక్కువ	2,30,000	2,07,000	23,000
20 గొర్రెలు, మేకలు	1,30,000	91,000	39,000
50 గొర్రెలు, మేకలు	2,30,000	1,61000	69,000
100 కోళ్లు	87,000	60,900	26,100
200 కోళ్లు	1,32,000	92,400	39,600

2019 గణాంకాల ప్రకారం పశు సంపద

మండలం	ఆవులు	గేదెలు	గొర్రెలు	మేకలు
నాగాయలంక	1,334	13,958	11,627	1,589
అవనిగడ్డ	483	7,071	766	808
కోడూరు	560	10,200	8,100	1,700
మోపిదేవి	788	7,692	7,924	2,595
చల్లపల్లి	894	11,158	9,382	2,565
ఘంటసాల	1,420	14,432	9,932	2,437
పామర్రు, పమిడిముక్కల	2901	19,865	4280	15,036

వరద బాధితులకు విరాళాలు

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలో విద్యాలయ పాఠశాల డైరెక్టర్ బొప్పన వెంకట విజయభాస్కర్ రూ. 1,75,000, విద్యా వికాస్ పాఠశాల డైరెక్టర్ సాంబశివరావు విద్యార్థులు, యాజ మాన్యం తరఫున రూ. 1,04,600, వికాస్ రెయిన్‌బో కరస్పాండెంట్ పుట్టి రామచం ద్రశేఖర్ రూ. 50 వేల చెక్కు ముఖ్యమం త్రికి అందజేశారు.


పామర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: పామర్రు మండల వరద బాధితులకు అండగా నిలిచాయి. జుజ్జువరం ఉషోదయ ఆంగ్ల మాధ్యమ పాఠశాల రూ. 2,87,786, పామర్రు ఏఎన్ఎం ఆంగ్ల మాధ్యమ పాఠశాల రూ. 1,55,558 విరాళం ఇచ్చాయి. డెమొక్రటిక్ ఛైర్మన్ గొల్లపూడి మోహనరావుతో కలిసి సీఎం క్యాంపు కార్యా లయంలో ముఖ్యమంత్రి సహాయ నిధికి చెక్కులు అందించారు. ఆయా పాఠశాలల ప్రిన్సిపల్స్ ఎండీ రఫీ, ఎ.పూర్ణచంద్రరెడ్డిలు అప్పో



చంద్రబాబుకు రూ.1.75 లక్షల చెక్కును అందిస్తున్న విద్యాలయ డైరెక్టర్ విజయభాస్కర్



రూ.1.02 లక్షల చెక్కు అందిస్తున్న సాంబశివరావు



చెక్కులు అందిస్తున్న ఉషోదయ, ఏఎన్ఎం పాఠశాలల ప్రిన్సిపల్స్ ఎండీ రఫీ, పూర్ణచంద్రరెడ్డిలు

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



విద్యార్థిని రేష్మతో హెచ్ఎం, వ్యాయామోపాధ్యాయుడు

జమీగొల్వేపల్లి (పామర్రు గ్రామీణం), న్యూస్‌టుడే: మండలం జమీగొల్వే పల్లి జడ్పీ పాఠశాల ఏడో తరగతి విద్యా ర్థిని కొల్లూరి రేష్మశ్రీ జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు ప్రధానో పాధ్యాయిని ఉషా రాణి బుధవారం తెలిపారు. రూర్కెలాలో ఈనెల 28 నుంచి అక్టోబరు 2 వరకు జరిగే 34వ సబ్ జూనియర్ నేషనల్ ఖోఖో ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనేందుకు ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపిక అయ్యిందన్నారు. క్రీడాకారిణికి శిక్షణ ఇచ్చిన వ్యాయా మోపాధ్యాయుడు నాలి రవిబాబులను పాఠశాల ప్రిన్సిపల్, సిబ్బంది, గ్రామ పెద్దలు, జిల్లా ఖోఖో సంఘం అధ్యక్షుడు మడకా ప్రసాద్, ఆంధ్ర ఖోఖో సంఘం కార్యదర్శి మేకల సీతా రామిరెడ్డి, అధ్యక్షుడు ప్రసాద్‌లు అభినందించారు.

ఎరువుల కొరతపై రైతుల ఆగ్రహం

గోవ్వానిపాలెం (పమిడిముక్కల), న్యూస్‌టుడే: తమకు అత్యవసరమైన యూరియా, పొటాష్ ఎరువులు అందుబా టులో లేవని, అధిక ధరలకు ప్రైవే, గ్రామాల నుంచి కొనవలసి వస్తోందని తెలిసినా మండల వ్యవసాయాధికారి పట్టించుకోవడం లేదని రైతులు వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడికి ఫిర్యాదు చేశారు. గోవ్వాని పాలెంలో బుధవారం జరిగిన పొలం పిలు స్తోంది కార్యక్రమంలో పాల్గొన్న సహాయ సంచాలకుడు టి.శ్రీనివాసరావును రైతులు స్థానిక వ్యవసాయశాఖ సిబ్బంది తీరుపై నిల దీశారు. రైతులు చేసిన ఫిర్యాదుపై స్పందిం చిన శ్రీనివాసరావు తమ సిబ్బంది పనితీ రుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రైతు లతో స్థానిక సహకార సంఘ కార్యాలయా నికి వెళ్లి అక్కడి దస్త్రాలను పరిశీలించారు.



సహకార సంఘంలో దస్త్రాలు పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

ఎరువుల విషయంలో ఇంత నిర్లక్ష్య వైఖరి ఎందుకని సంఘ సిబ్బందిని ప్రశ్నించారు. ఇతర సంఘాల్లో కూడా ఎరువులు రైతులకు అందుబాటులో ఉండేలా చూడాలని మండల వ్యవసాయాధికారి ఎస్ గణేష్‌రెడ్డిని ఆదే శించి, రైతులను సమస్యలెదైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

కురుమద్దాలి, కనుమూరు(పామర్రు గ్రామీణం), న్యూస్‌టుడే: ప్రస్తుత రైతులు వ్యవసాయ సాగులో తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడులు సాధించాలని ఎంఏవో వి.శివనాగరాజు అన్నారు. బుధ వారం మండలంలోని కురుమద్దాలి, కను మూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్య క్రమం నిర్వహించారు.

కూచిపూడి, న్యూస్‌టుడే: కూచిపూడిలో జరిగిన కార్యక్రమంలో స్థానిక మండల వ్యవ సాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త కె.హరి పొలాల్లో పలు సూచనలు చేశారు. వ్యవ సాయ పరిశోధనా స్థానం (మంటసాల)లో రబీలో వేసుకునేందుకు మినుము ఎల్‌బీజీ - 932, ఎల్‌బీజీ - 904, జీబీజీ - 1 రకాలు రబీలో ఉన్నాయని తెలిపారు.

ఘంటసాల, న్యూస్‌టుడే: స్థానిక కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్త బి.నవీన్ పాపవి నాశనం, గోగినేనిపాలెం గ్రామాల్లో వరి పొలాలను రైతులతో కలిసి పరిశీలించారు.

పండ్ల వర్తకుని కుటుంబానికి బీమా యోజన

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: గుడివాడ పండ్ల వర్తక సంఘ సభ్యుడు ఇటీవల అనారో గ్యంతో మృతి చెందగా.. అతని కుటుంబానికి ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన కింద రూ. 2 లక్షలు మంజూరైంది. గుడివాడ పోస్టల్ సూపరింటెండెంట్ చల్లా అప్పారావు.. గుడివాడ పండ్ల వర్తక సంఘ అధ్యక్షుడు బలరా మ్‌తో కలిసి బాధిత కుటుంబానికి బుధవారం చెక్కు అందజేశారు. మాజీ కౌన్సిలర్ చింతయ్య మాట్లాడుతూ బలరామ్ ముందుచూపుతో జీవీ ఆర్ వెల్ఫేర్ సొసైటీ ద్వారా పీఎంజేజేబీవైకు పాలసీలు చేయించారన్నారు. పోస్టల్ బ్యాంకు మేనేజర్ గణేష్, పోస్టుమాస్టర్ పవిత్‌కుమార్, పండ్ల వర్తక సంఘ నేతలు పెద్ది కిషోర్, పెద్ది రమణ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలుకు కృషి



ప్రజా సమస్యలు వింటున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యే రావి

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: బిళ్లపా డులో 'ఇది మంచి ప్రభుత్వం' గ్రామ సభలో ఎమ్మెల్యే రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వ రరావుతో కలిసి పాల్గొన్నారు. రాము మాట్లా డుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సంక్షేమానికి ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తున్నామన్నారు. గ్రామంలో పర్య టించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకు న్నారు. 100 రోజుల పాలనపై కరపత్రాలు పంపిణీ చేశారు. జనసేన బాధ్యుడు బూరగడ్డ శ్రీకాంత్, భాజపా కన్వీనర్ దావులూరి సురేంద్ర బాబు, మండల తెదేపా అధ్యక్షుడు వాసే మురళీ, కర్రె గిరి, తాహసీల్దారు రామకోటేశ్వరరావు, ఎంపీ డీవో రమణ, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

పెదపారుపూడి, న్యూస్‌టుడే: క్రీడలతో మానసిక ఉల్లాసం కలు గుతుందని సర్పంచి కొల్లూరి అనూష అన్నారు. బుధవారం మండలంలోని యలమర్రు జడ్పీ పాఠశాలలో గత పది రోజులుగా జరుగుతున్న ఖోఖో ముగింపు శిక్షణ శిబిరంలో ఆమె మాట్లాడారు.

ప్రతి గృహానికి రూ.10 వేలు నష్టపరిహారం

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే: లంక గ్రామాల్లో వరదకు దెబ్బతిన్న ఇళ్ల జాబితా సిద్ధం చేశామని తహసీల్దార్ ఎం.కుసుమకుమారి బుధవారం తెలిపారు. తోడేళ్లదిబ్బలంక, కాళింగదిబ్బ, పాముల లంక, తుమ్మలపచ్చికలంక, పిల్లివానిలంక, పోట్టిదిబ్బలంక, కనిగిరి లంక, ములకలపల్లిలంకలో మొత్తం 1182 గృహాలు దెబ్బతిన్నాయ న్నారు. ప్రతి గృహానికి రూ. 10 వేలు నష్టపరిహారం లబ్ధిదారుల ఖాతాలో త్వరలో జమ అవుతాయని తహసీల్దార్ వివరించారు.

కూలి డబ్బులు ఇప్పించండి

మోపిదేవి, న్యూస్‌టుడే: నాగాయలంక మండల స్థాయి పౌరసరఫరాల గోదాములో పనిచేస్తున్న 19 మంది కూలీలకు ఆగస్టు కూలి రాలేదని బుధవారం వాపోయారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకుని ఈ సమస్యను పరి ష్కరించాలని ముఠా కార్మికులు కోరారు. ఆగస్టుకు దాదాపు రూ. 2 లక్షలకు పైగా రావాల్సి ఉందని పేర్కొన్నారు. వరదల సమయంలో కూడా విధులు నిర్వహించామన్నారు.

ఉబికి వస్తున్న భూగర్భ జలాలు



చేతిపంపు నుంచి కొట్టకుం డానే నీరు ఉబికివస్తున్న మలన పెదప్రోలు ప్రశాంతి నగర్ అంగన్‌వాడీ ఆవర ణలో బుధవారం చోటుచేసు కుంది. ఉదయం నుంచి నిరంతరాయంగా నీళ్లు వస్తుండటంతో మాసేందుకు పలువురు వచ్చారు. ఈనె లలో కురిసిన అధికవర్షాలు, వరదల వల్ల ఇలా జరిగి ఉండవచ్చని ప్రజలు భావిస్తున్నారు.

- న్యూస్‌టుడే, పెదప్రోలు(మోపిదేవి)

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష వితరణ



నగదు అందిస్తున్న దాతలు

మోపిదేవి, న్యూస్‌టుడే: తెనాలికి చెందిన కొడాలి ప్రతాప్ కుమార్- సంధ్యారాణి దంప తులు బుధవారం మోపిదేవి సుబ్రహ్మ ణ్యేశ్వరస్వామి నిత్యా న్నదాన పథకానికి రూ.లక్ష వితరణ చేశారు. దాతల కుమారుడు కొడాలి షణ్ముఖ్ పేరిట ఆలయ ఈవో దాసరి శ్రీరామవరప్రసాద్‌కు నగదు అందజేశారు. విజయవాడకు చెందిన ఎన్నాకుల వెంకట రామచేంద్ర మణికంఠ రూ. 20 వేల విరాళం చేసే వెండి గిన్నె, తదితర సామగ్రిని ఆలయ ఈవోకు అందించారు.

ఇస్రో నమూనాల ప్రదర్శనకు స్పందన



రాకెట్ల నమూనాల గురించి వివరిస్తున్న ఆర్పీ

గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే: స్థానిక ఏఏఎన్ఎం, వీవీఆర్ ఎస్ఆర్ హైస్కూల్‌లో ఇస్రో, విజ్ఞాన భారతి సంయుక్తంగా బుధవారం స్పేస్ ఆన్ వీల్స్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతి థులుగా స్థానిక ఎస్ఆర్జీ ఈసీ వైస్‌ప్రిన్సిపల్ పి.కోటేశ్వ రరావు విచ్చేసి దీనిని ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన, ఆసక్తి కల్పించేందుకు ఈ ప్రదర్శన దోహద పడుతుందన్నారు. విశిష్ట అతిథి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మిద్దె శ్రీనివాసరావు విద్యార్థులకు శాస్త్రీయ అవగాహన, శాస్త్ర సాంకేతిక విషయాలపై తప్పనిసరిగా అవగాహన పెంచుకోవాలన్నారు. ఇస్రో ప్రయోగించిన వివిధ శాటిలైట్, రాకెట్, లాంచర్లు పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ తదితర నమూనాలను విద్యార్థులు ఆసక్తిగా వీక్షించారు. వీటి గురించి వాహ నంలో ఆర్పీలు వివరించారు. హెచ్ఎం లీనా, సత్యంబాబు పాల్గొన్నారు.

రోగులకు ఉపయుక్తమైన మందుల తయారీపై దృష్టి

గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే: స్థానిక వీవీ ఫార్మసీ కళాశాలలో బుధవారం ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న గుడివాడ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీమూర్తి మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల కష్టపడితే కానీ ఒక ఔషధం రూపొందదన్నారు. దీనిని ప్రజలకు చేరువ చేయాల్సిందే ఫార్మసిస్టేనన్నారు. ఫార్మసిస్టులు ఆరోగ్య ప్రదాతలని, విద్యార్థులు విస్తృతంగా పరిశోధనలు చేసి రోగు లకు ఉపయుక్తమైన ఔషధాలు తయారు చేసి చేరువ కావాలన్నారు. ఫార్మసిస్టు కొన్నత్యంపై నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, స్లోగన్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎ. లక్ష్మణరావు, ఇండియన్ ఫార్మాటికల్ అసోసియేషన్ గుడ్లవల్లేరు శాఖ అధ్యక్ష, ఉపాధ్యక్ష కార్యదర్శులు పి. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పామర్రు, న్యూస్‌టుడే: స్థానిక సీహెచ్‌సీలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి తాడి శెట్టి నరేష్‌లు పాల్గొన్నారు. పామర్రు సీహెచ్‌సీ ఫార్మసిస్ట్ పావని, విజయవాడ జీజీహెచ్‌కి చెందిన రవిశంకర్ తదితరులను ఎమ్మెల్యే సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే కుమార్‌రాజాను పావని తదిత రులు సన్మానించారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు లుక్కా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అవనిగడ్డలో భారీ వర్షం



కాలువను తలపిస్తున్న ప్రధాన రహదారి




చెరువులా ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం



నీటమునిగిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణం

అవనిగడ్డ, న్యూస్‌టుడే: అవనిగడ్డలో మంగళ వారం అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. 48.2 ఎంఎం వర్షపాతం నమోదైంది. ప్రధాన రహదారి తహసీల్దార్ కార్యాలయం, పంచాయతీ కార్యాలయం వద్ద, పార్కు వద్ద మురుగు కాల్వలతో కలిసి పోయి పంట కాలు వను తలపించాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల మైదానం, ప్రాంగణాలు నీట మునిగాయి. మధ్యాహ్నం నుంచి పంచాయతీ సిబ్బంది వర్షపు నీటిని బయటకు తరలించే ఏర్పాట్లు చేశారు.

గాయకుడు ఎస్పీ బాలుకు నివాళి



పామర్రు: బాలు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఘంటసాల, ఎన్టీఆర్ కళాపీఠం సభ్యులు

అవనిగడ్డ, పామర్రు, న్యూస్‌టుడే: గానగంధ ర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తెలుగు సినీ సంగీతాన్ని సుసంపన్నం చేశారని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. బాలు వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం ఆయన కార్యా లయంలో బాలు చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. జనసేన నాయకుడు మండలి వెంకట్రామ్, జనసేన, తెదేపా నాయ కులు తదితరులు పాల్గొన్నారు. * పామర్రు హితమ్ పాఠశాలలో ఘంటసాల, ఎన్టీఆర్ కళా పీఠం అధ్యక్షుడు కాటూరి వెంకటమల్లేశ్వర్శర్మ, కార్యదర్శి హేమంతరెడ్డి, సందిపాటి నాగిరెడ్డి, పాఠశాల సిబ్బంది బాలు చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు.

పాలాల్లో కాలిపోతున్న మీటర్లు

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే: కృష్ణా నదికి వరదలు వచ్చి లంక పొలాల్లో మోటారు కనెక్షన్లు ముని గిపోయాయని, దీంతో మీటర్లలో ఒండ్రు పేరుకు పోయిందని రైతులు వాపోతున్నారు. ఇటీవల లంకల్లో మోటార్లకు విద్యుత్తుశాఖ అధికారులు విద్యుత్తు సరఫరా చేయడంతో మోటార్లు, స్టార్టర్లు కాలిపోతున్నాయని తెలిపారు. రైతులు కొన్ని మీటర్లు మార్చుకుంటున్నా స్టార్టర్లు బాగు చేయించుకుని స్విచ్ వేయడంతో మీటర్లు కాలిపోతున్నాయని బుధవారం రైతులు తెలిపారు. ఏఈ దేవదాసు మాట్లాడుతూ మీటర్లు పాడైతే గుత్తేదారే పరిశీలించి సరిచేసి బిగించాలని తెలిపారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

ఘంటసాల, న్యూస్‌టుడే: గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీవో డి. సుబ్బారావు తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ సిబ్బం దితో సమీక్ష సమావేశం నిర్వహించారు. స్వర్ణాంధ్ర 2047 కార్యక్రమంలో భాగంగా ఈనెల 27న అవగాహన సదస్సులు నిర్వహించేందుకు గ్రామ పంచాయతీల వద్ద సమావేశాలు నిర్వహించాలన్నారు. 7,118 మందికి పింఛన్లను రూ. 2.90 కోట్ల నగదును అక్టోబరు 1న అందజేస్తామన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

ఘంటసాల: పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కోరుతూ గుంటూరు లాం విశ్వవిద్యా లయం గ్రామీణ కృషి విజ్ఞాన కేంద్రం విద్యార్థులు బుధ వారం తాడేపల్లిలో ప్రదర్శన చేశారు. ప్లాస్టిక్, పాలి థిన్ కవర్లను వాడకూడదని ప్లకార్డుల ద్వారా ప్రదర్శించారు. సుభాష్ చంద్రబోస్ రైతులు పాల్గొన్నారు.

పెనమలూరు

• పెనమలూరు • గన్నవరం

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే : గత వైకాపా ప్రభుత్వం పంచాయతీతో పాటు అన్ని నిధుల మళ్లింపుతో గడిచిన ఐదేళ్ల అభివృద్ధిని పక్కన పెట్టిందని.. తాజాగా వాటిన్నటిని గాడిలో పెడుతూ వంద రోజుల్లోనే ఎన్డీయే సర్కార్ 'ఇది మంచి ప్రభుత్వం' అనిపించిందని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పేర్కొన్నారు. మండలంలోని ముస్తాబాద, సూరంపల్లిలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

ఉయ్యూరు గ్రామీణం, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం హయాంలోనే సంక్షేమ పథకాలు అమలు, రాష్ట్రం అభివృద్ధి చెందుతుందనే నమ్మకం ప్రజల్లో ఉందని ఆకునూరు సర్పంచి గోలి వసంత్‌కుమార్ అన్నారు. గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం స్టిక్కర్లు ఆవిష్కరించారు.


స్టిక్కర్లు ఆవిష్కరిస్తున్న సర్పంచి వసంత్‌కుమార్, తహసీల్దార్ సురేష్‌కుమార్

బాధిత కుటుంబానికి సాయం


కీర్తన కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న ఎమ్మెల్యే సుజనా చౌదరి

కానూరు, న్యూస్‌టుడే : బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న చిన్నారి కీర్తన కుటుంబ సభ్యులకు వైఎస్ఆర్ ఛారిటీస్ సంస్థ ఛైర్మన్ యలమంచిలి జయప్రకాష్ రూ.50 వేలను సాయంగా అందించారు. బుధవారం తాడిగడప వందడుగుల రోడ్డులో విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి చేతుల మీదుగా ఈ మొత్తాన్ని చిన్నారి కుటుంబ సభ్యులకు అందజేశారు.

సమస్యల నిలయం.. ప్రయాణికుల ప్రాంగణం

☛ హనుమాన్ జంక్షన్ కొత్త బస్టాండ్‌లో ఇదీ పరిస్థితి

హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే

హనుమాన్ జంక్షన్ ఆర్టీసీ బస్టాండ్ నూతన ప్రాంగణం అందుబాటులోకి వచ్చినా సమస్యలు మాత్రం తీరలేదు. గత ప్రభుత్వం ఆధునిక హంగులతో ఇంటిగ్రేటెడ్ బస్టాండ్ పేరుతో నత్తనడకన పనులు నిర్వహించింది. పూర్తిగా వసతులు కల్పించకుండానే ఎన్నికల కోడ్‌కు ముందు హడావుడిగా దీన్ని ప్రారంభించారు. అప్పటి నుంచి ఎలాంటి పనులు చేపట్టకపోవడంతో బస్సులు, ప్రయాణికులు బురదలోనే రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది.

ఆరు నెలలు గడచినా..

జాతీయ రహదారిని ఆనుకుని 60 సెంట్ల విస్తీర్ణంలోనే ఏడు దశాబ్దాల కిందట పాత ప్రాంగణం నిర్మించారు. ఇది పూర్తిగా శిథిలావస్థకు చేరడం, లోతట్టుగా ఉండి ముంపునకు గురవ్వడంతో ప్రయాణికులు అవస్థలు పడేవారు. దీంతో వెనక భాగంలో 2022లో అధునాతన బస్టాండ్ నిర్మాణం చేపట్టారు. పనులు కొలిక్కి రాకుండానే ఈ ఏడాది మార్చి 5న హడావుడిగా ప్రారంభించారు. కానీ ఆరు నెలలు దాటినా కూడా పూర్తి వసతులు సమకూరక పోవడం గమనార్హం.

అవే అవస్థలు..

కొత్త బస్టాండ్ ఎక్కువ ఎత్తులో నిర్మించినా, పాత బస్టాండ్ మీదుగానే బస్సులు, ప్రయాణికులు రాకపోకలు సాగించాల్సి ఉంది. ఇది లోతట్టున ఉండి, చిన్నపాటి వర్షానికే జలమయమైపోతోంది. దీంతో రోజుల తరబడి నీరు నిలిచిపోవడం, ప్రాంగణమంతా బురద మేట


బురదతో నిండిన ప్లాట్‌ఫాంలు

వేసుకుపోవడంతో బస్టాండ్‌తో పాటు, రహదారులు సైతం బురదమయంగా తయారవుతున్నాయి. మరోవైపు కొత్త బస్టాండ్‌కు ఇరువైపులా ఉన్న ప్లాట్‌ఫాంలను సిమెంట్ చేయకుండా మట్టిపోసి వదిలేశారు. దీంతో భారీ వర్షాలు కురిసినప్పుడు బస్సులు కూరుకుపోతున్నాయి. మరోపక్క ప్రయాణికులు కూడా ఆ బురదలోనే నడవడం అనివార్యమైంది.

శాశ్వత పరిష్కారమేదీ...?

కొత్త బస్టాండ్ నిర్మాణం పూర్తయ్యాక పాత దాన్ని పడగొట్టి, ఆ స్థలాన్ని టెండర్ల ద్వారా బీవోటీ ప్రాతిపదికన వాణిజ్య సముదాయం నిర్మించేలా, బస్టాండ్ మొత్తం 16వ జాతీయ రహదారికి అనుసంధానమయ్యేలా ఇరువైపులా 70 అడుగుల నుంచి 32 అడుగుల వెడల్పుతో రోడ్లు వేసేలా గతంలో ప్రణాళికలు రూపొందించారు. కానీ ఇప్పటి వరకు దీనికి సంబంధించి ఎలాంటి టెండర్లు పిలవలేదు. ఇది ఆచరణలోకి వస్తేనే బస్టాండ్‌లో నెలకొన్న సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, ఆ దిశగా కార్యాచరణ చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.


వర్షం వస్తే బస్సులు, ప్రయాణికులు నడిచే మార్గం ఇలా..

బస్టాండ్ నిర్మితమైంది	1956
ఇక్కడ నుంచి ప్రతిరోజూ నడిచే సర్వీసులు	860
రాకపోకలు సాగించే ప్రయాణికులు	7,000
మొత్తం విస్తీర్ణం	1.70 (ఎకరాల్లో)
కొత్త బస్టాండ్ నిర్మించిన విస్తీర్ణం	8,000 (చ.గజాల్లో)
నూతన బస్టాండ్ నిర్మాణానికి వెచ్చించిన నిధులు	రూ.4.40 కోట్లు

త్వరితగతిన పనులు పూర్తి చేసేలా చర్యలు

నూతన బస్టాండ్ నిర్మాణం తర్వాత కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవమే. వాటిని త్వరితగతిన పూర్తి చేసేలా ఉన్నతాధికారుల సూచనల మేరకు చర్యలు చేపట్టాం. ఇప్పటికే ప్రహరీ నిర్మించాం. రోజుల వ్యవధిలోనే ప్లాట్‌ఫాంలను సిమెంట్‌తో అభివృద్ధి చేస్తాం. పాత బస్టాండ్‌ను బీవోటీ ప్రాతిపదికన అభివృద్ధి చేసేందుకు కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయి.

-శివాజీ, ఆర్టీసీ డీఎం, గన్నవరం

నిత్యాన్నదాన పథకానికి వితరణ

మోపిదేవి, న్యూస్‌టుడే: తెనాలికి చెందిన కొడాలి ప్రతాప్ కుమార్-సంధ్యారాణి దంపతులు బుధవారం మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష వితరణ చేశారు. దాతల కుమారుడు కొడాలి షణ్ముఖ్ పేరిట ఆలయ ఈవో దాసరి శ్రీరామవరప్రసాద్‌కు నగదు అందజేశారు. ఖమ్మంకు చెందిన ఎన్నాకుల వెంకట రాఘవేంద్ర మణికంఠ రూ.20 వేల విలువ చేసే వెండి గిన్నె, తదితర సామగ్రిని ఆలయ ఈవోకు అందించారు.

పంచాయతీ కార్యదర్శుల బదిలీ

కంకిపాడు : మండలంలోని పది గ్రామ పంచాయతీ కార్యదర్శులు బదిలీ అయ్యారు. వీరిలో తొమ్మిది మంది గ్రేడ్- 1 కాగా ఒకరు గ్రేడ్- 2 కేటగిరికి చెందిన వారు. ఒ.టి.వెంకటరత్నంను కోలవెన్ను నుంచి పెనమలూరు మండలం పెదపులిపాకకు, సయ్యద్ కరీమ్ అహ్మద్‌ను ఈడుపుగల్లు నుంచి పెనమలూరుకు, టి.శ్రీనివాస్‌ను ఉప్పలూరు నుంచి కోలవెన్నుకు, ఒ.రామకృష్ణను కంకిపాడు నుంచి ప్రొద్దుటూరుకు, ఎం.కృష్ణమోహన్‌ను మంతెన నుంచి రొయ్యూరుకు, డి.బాపూజీని వీరపనేనిగూడెం నుంచి పునాదిపాడుకు, జి.రత్నకిషోర్‌ను మానికొండ నుంచి ఈడుపుగల్లుకు, కోటేశ్వరరావును ఇందుపల్లి నుంచి కుందేరుకు, బొమ్మిడి వెంకటేశ్వరరావును పునాదిపాడు నుంచి ఉప్పలూరుకు, వెంకటేశ్వరరావును వేల్పూరు నుంచి గోసాలకు బదిలీ చేసినట్లు ఉత్తర్వులు అందాయని ఎంపీడీవో అనూష తెలిపారు.

చదరంగం పోటీల్లో ప్రతిభ

కంకిపాడు, న్యూస్‌టుడే : కోలవెన్ను జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన మండల స్థాయి చదరంగం పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు బి.సతీష్, బి.వెంకట పార్థివ్ సాయి, టి.వినీత, సి.ప్రణీత, డి.షణ్ముఖ ప్రియ, టి.సుశాంత్, కె.పవన్ సాయి సిద్ధార్థ వివిధ విభాగాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారని కంకిపాడు సెయింట్ మేరీస్ హైస్కూల్ కరస్పాండెంట్ ఎం.సాల్మన్‌రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు విజేతలు, వారికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. త్వరలో జరిగే నియోజకవర్గ స్థాయి పోటీలకు వీరంతా ఎంపికయ్యారని ప్రిన్సిపల్ సిస్టర్ చిత్ర చెప్పారు.

వరద బాధితులకు విరాళం


ఎమ్మెల్యే బోడే ప్రసాద్‌కు చెక్కు అందిస్తున్న విద్యార్థులు

పెనమలూరు, న్యూస్‌టుడే : చిట్టిచేతులు గట్టి సాయాన్ని అందించాయి. వరద బాధితుల కోసం ఉయ్యూరు విజయసాయి పాఠశాలకు చెందిన విద్యార్థులు ఇంటింటా సేకరించిన విరాళాలు రూ.50 వేలను ఎమ్మెల్యే బోడే ప్రసాద్‌కు బుధవారం అందజేశారు. ఈ మొత్తంతో ఇప్పటి వరకూ పెనమలూరు నియోజకవర్గం నుంచి సీఎం సహాయనిధికి రూ.50 లక్షలు సమకూరాయి. విద్యార్థులను ఎమ్మెల్యే అభినందించి స్వయంగా మిఠాయిలు అందజేశారు. పాఠశాల డైరెక్టర్ శ్రీపురం వేణు శివప్రసాద్, ప్రిన్సిపల్ కనకలక్ష్మి, తెదేపా నేతలు అనుమోలు ప్రభాకరరావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థినికి చేయూత


విద్యార్థినికి అంగీకార పత్రం అందిస్తున్న సుబ్రమణ్యం

హనుమాన్ జంక్షన్ : సీఏ విద్యార్థినికి బొమ్ములూరులోని దీపక్ నెక్స్‌జెన్ ఫ్యాక్టరీ అధినేత అడుసుమిల్లి సుబ్రమణ్యం బాసటగా నిలిచారు. ఏలూరు జిల్లా మండవల్లి మండలం గన్నవరానికి చెందిన మందపాటి లక్ష్మీశరణ్య సీఏ ఫౌండేషన్ పూర్తి చేసి, ఇంటర్‌లో చేరేందుకు సిద్ధమైంది. ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉండటంతో తల్లిదండ్రులు దాతల్ని ఆశ్రయించారు. ఈ క్రమంలో అడుసుమిల్లి సుబ్రమణ్యం కళాశాల రుసుంగా చెల్లించాల్సిన రూ.1.75 లక్షలను చెల్లించేందుకు ముందుకొచ్చారు. బుధవారం ఈ మేరకు లక్ష్మీశరణ్యకు హామీ ఇచ్చారు. ఇదే క్రమంలో హనుమాన్ జంక్షన్ మానవత తరఫున రూ.25 వేలు సాయమందించారు.

రహదారికి మరమ్మతులు చేపట్టరూ..


గోతులమయంగా తాడిగడప- పెదపులిపాక రోడ్డు

తాడిగడప నుంచి పెదపులిపాక వెళ్లే రహదారి గోతులమయంగా మారి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎస్టీబీల్ కాలనీ సమీపంలో ఎక్కువ గుంతలు పడి రోడ్డు అధ్వానంగా మారింది. దీంతో కాలనీవాసులతో పాటు పెదపులిపాకకు వెళ్లే వారు నానా అవస్థలు పడుతున్నారు. నిత్యం వందలాది మంది రాకపోకలు సాగించే ఈ రహదారిని పట్టించుకునే వారు కరవయ్యారు. వర్షం వచ్చిన సమయంలో ఈ గోతుల్లో నీరు చేరి రోడ్డు కనపడక వాహనదారులు ప్రమాదాల బారిన పడిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.- **న్యూస్‌టుడే, తాడిగడప(కానూరు)**

కొనకళ్లకు సత్కారం


నారాయణరావును సన్మానిస్తున్న దండమూడి చౌదరి


కొనకళ్లను అభినందిస్తున్న శంకరబాబు, సుచిత్ర తదితరులు

ఉయ్యూరు గ్రామీణం, న్యూస్‌టుడే : ఆర్టీసీ ఛైర్మన్‌గా నియమితులైన మాజీ ఎంపీ, తెదేపా జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణను తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి బుధవారం కలిసి సత్కరించారు. నాయకులు కేదరసపల్లి శ్రీను, మొర్ల శివ, సలీమ్, సజ్జా మధు, యుగబాబు తదితరులు పాల్గొన్నారు.

కానూరు, న్యూస్‌టుడే : ఆర్టీసీ ఛైర్మన్‌గా నియమితులైన కొనకళ్ల నారాయణను తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు బుధవారం కలిసి అభినందనలు తెలిపారు. తెదేపా మహిళా అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర, ఇమామ్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

రామవరప్పాడు, న్యూస్‌టుడే : ఆర్టీసీ ఛైర్మన్‌గా నియమితులైన తెదేపా జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావును గన్నవరం నియోజకవర్గానికి చెందిన తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోనేరు నాగేంద్ర కుమార్(నాని), తెదేపా రాష్ట్ర కార్యదర్శి దొంతు చిన్నా కలిసి అభినందనలు తెలిపారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి


మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు

హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే : మండల వ్యాప్తంగా పక్కా గృహాల నిర్మాణాలు వేగవంతం చేసేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు సూచించారు. బుధవారం మండల పరిషత్తు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. మన ఇల్లు- మన గౌరవం పేరుతో గ్రామాల వారీగా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని కోరారు. 2025 మార్చి నాటికి ఇళ్లన్నీ పూర్తి చేసేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. ఈవోపీఆర్డీ విజయలక్ష్మి, గృహ నిర్మాణ ఏఈ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పెనమలూరు, న్యూస్‌టుడే : రానున్న మార్చి నాటికి వణుకూరు, పెనమలూరు లేఔట్లలో కేటాయించిన స్థలాల్లో లబ్ధిదారులు గృహ నిర్మాణాలు చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి కె.శంకరరావు పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్చి నెలాఖరు లోగా గృహాలు నిర్మించుకోకపోతే కేంద్ర ప్రభుత్వ నిధులు వినియోగంలోకి రావన్నారు. తహసీల్దారు గోపాలకృష్ణ, ఎంపీడీవో సునీతాశర్మ, గృహ నిర్మాణశాఖాధికారి జిలానీ తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందుల వినియోగం తగ్గించాలి


గన్నవరం: అన్నదాతలతో వ్యవసాయాధికారిణి తేజస్వి

ఉయ్యూరు గ్రామీణం, న్యూస్‌టుడే : రైతులు పురుగు మందుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ వ్యవసాయం వైపు ఆసక్తి చూపాలని జిల్లా వ్యవసాయాధికారి ఎన్.పద్మావతి తెలిపారు. ఆకునూరులో బుధవారం నిర్వహించిన పొలం బడి కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సేంద్రియ ఎరువుల వల్ల ఖర్చు తగ్గుతుందని, నేల ఆరోగ్యకరంగా ఉంటుందని, మంచి ఆహార ఉత్పత్తులను అందించవచ్చని తెలిపారు.

పెనమలూరు, న్యూస్‌టుడే : కలుపు, పురుగు మందులను ఒకేసారి వినియోగించడం సరికాదని మండల వ్యవసాయ, ఉద్యాన శాఖాధికారులు కనకమేడల శైలజ, చందు జోసెఫ్ పేర్కొన్నారు. పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా వీరు బుధవారం గోసాల, వణుకూరులో పంట పొలాలను పరిశీలించారు.

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే : సకాలంలో సస్యరక్షణ చర్యలతోనే అధిక దిగుబడి సాధ్యమని వ్యవసాయాధికారులు తేజస్వి, హరీష్‌కుమార్ తెలిపారు. మండలంలోని బుద్ధవరం, ఉంగుటూరు మండలం ఆత్కూరు, పొట్టిపాడులో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. మట్టి నమూనా పరీక్ష ఫలితాలను అనుసరించి ఎరువుల వాడకం ఉండాలంటూ పలు సూచనలు, సలహాలు చేశారు.


గోడప్రతులు ఆవిష్కరిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి పద్మావతి


పెనమలూరులో..

నీరు చాలదు.. దప్పిక తీరదు..

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే


ఆర్వోప్లాంట్‌కు వేసిన తాళం

ప్రభుత్వం అందించిన ఆర్వో ప్లాంట్ మూలకు చేరడంతో ఉంగుటూరు మండలం వెల్దిపాడు మండల పరిషత్తు పాఠశాలలో తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. నిత్యం బయట నుంచి కేవలం ఒక డబ్బా మంచినీటినే విద్యార్థులకు అందిస్తున్నారు. దీంతో చాలీచాలని నీటితో దప్పిక తీర్చుకోలేక చిన్నారులు పడుతున్న అవస్థలు అన్నీఇన్నీ కావు. మరోవైపు ఇరవై మందికి ఒక ఉపాధ్యాయుడు అన్న ప్రభుత్వ నిబంధనలుండగా అదనంగా మరో విద్యార్థి ఉన్నారని రెండో పోస్టును కొనసాగించడం విశేషం. ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదన్న ఆరోపణలున్నాయి. పాఠశాలలో ఒకటి, రెండు తరగతుల విద్యార్థులు మొత్తం 21మంది విద్యను అభ్యసిస్తున్నారు.

క్రీడాకారులకు అభినందన


విజేతలతో ఉపాధ్యాయులు

హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే : పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 24న బాపులపాడులో నిర్వహించిన మండల స్థాయి ఆటల పోటీల్లో వీరవల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్, షటిల్‌లో విజేతలుగా నిలిచారు. 27న గన్నవరంలో జరిగే నియోజకవర్గ స్థాయి పోటీలకు వీరు అర్హత సాధించారు. ఈ నేపథ్యంలో బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం పి.నిర్మల ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం వీరిని అభినందించింది.



రహదారి ఇలా.. ప్రయాణం ఎలా..?

ప్రసాదంపాడు, ఎనికేపాడు, న్యూస్‌టుడే


అధ్వానంగా కానూరు డొంక రోడ్డు

ప్రసాదంపాడులోని శ్రీశక్తి కల్యాణ మండపం మీదుగా జాతీయ రహదారి వైపు వెళ్లే కానూరు డొంక రోడ్డు గుంతలతో ప్రమాదకరంగా మారింది. ఈ ప్రాంతంలో అనేక పరిశ్రమల గోదాములు ఉండడంతో పలు ట్రాన్స్‌పోర్టు లారీలు ఎక్కువగా రాకపోకలు సాగిస్తూంటాయి. సుమారు నాలుగు సంవత్సరాలుగా ఈ రహదారికి మరమ్మతులు చేపట్టలేదు. దీనికి తోడు ఇటీవల కురిసిన వర్షాలకు ఈ రోడ్డు మరింత అధ్వానంగా మారింది. రెండు అడుగుల మేర గుంతలు ఏర్పడంతో వర్షం పడిన సందర్భాల్లో ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రస్తుతం రోడ్డు మొత్తం దెబ్బ తినడంతో వాహనాలు తిరిగే సమయంలో దుమ్ము విపరీతంగా వచ్చి పలువురు అనేక అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఎరువుల కొరతపై రైతుల ఆగ్రహం


దస్త్రాలు పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

గోపువానిపాలెం (పమిడిముక్కల) న్యూస్‌టుడే: తమకు అత్యవసరమైన యూరియా, పొటాష్ ఎరువులు అందుబాటులో లేవని, అధిక ధరలకు పక్క గ్రామాల నుంచి కొనవలసి వస్తోందని తెలిపినా మండల వ్యవసాయాధికారి పట్టించుకోవడంలేదని రైతులు వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడికి ఫిర్యాదు చేశారు. గోపువానిపాలెంలో బుధవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న సహాయ సంచాలకుడు టి.శ్రీనివాసరావును రైతులు స్థానిక వ్యవసాయశాఖ సిబ్బంది తీరుపై నిలదీశారు. రైతుల చేసిన ఫిర్యాదుపై స్పందించిన శ్రీనివాసరావు తమ సిబ్బంది పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రైతులతో స్థానిక సహకార సంఘ కార్యాలయానికి వెళ్లి అక్కడి దస్త్రాలను పరిశీలించారు. ఎరువుల విషయంలో ఇంత నిర్లక్ష్య వైఖరి ఎందుకని సంఘ సిబ్బందిని ప్రశ్నించారు. ఇతర సంఘాల్లో కూడా ఎరువులు రైతులకు అందుబాటులో ఉండేలా చూడాలని మండల వ్యవసాయాధికారి ఎస్ గణేష్‌రెడ్డిని ఆదేశించి, రైతులను సమస్యలేమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.



రోడ్డు ప్రమాదంలో కాపలాదారుకు గాయాలు

పెనమలూరు, న్యూస్‌టుడే : ద్విచక్ర వాహనం ఢీ కొట్టిన సంఘటనలో కాపలాదారుకు గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం..దేవరకొండ వెంకటేశ్వర్లు పోరంకి నివాసి. ఇతను ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తుంటారు. ఈ నెల 22న తన సైకిల్ పై పోరంకి సెంటర్‌కు వెళ్తుండగా వెనుక నుంచి వేగంగా వస్తున్న ఓ ద్విచక్ర వాహనం ఢీ కొట్టింది. ఈ సంఘటనలో వెంకటేశ్వర్లుకు బలమైన గాయాలయ్యాయి. ఇతను ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా కుమారుడు రాజు బుధవారం పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం విక్రేత అరెస్టు

గన్నవరం గ్రామీణం: గుట్టుచప్పుడు కాకుండా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని గన్నవరం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని సూరంపల్లిలో ముందస్తు సమాచారంతో తనిఖీలు నిర్వహించగా పలగాని సత్యనారాయణ మద్యం విక్రయిస్తున్నట్లు గుర్తించారు. దీంతో అతని వద్ద నుంచి 15 మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

కళతప్పి.. తుప్పుపట్టి..!



తుప్పు పట్టిన మనిషి బొమ్మ


తలలేని కోడి బొమ్మ

పాడైపోయిన ఇనుప తుక్కుతో అందమైన కళాఖండాలను తీర్చిదిద్దారు. కానీ వాటి నిర్వహణను గత వైకాపా ప్రభుత్వం గాలికి వదిలేయడంతో రంగులు లేక తుప్పు పట్టి కళావిహీనంగా మారాయి. కోడి బొమ్మకు తలకాయ లేక.. రంగులు మార్చే ఊసరవెల్లి సైతం వెలవెలబోతూ కనిపిస్తోంది. మరోవైపు సిటీ బస్టాండ్ దగ్గర పోలీసు కంట్రోల్ పాయింట్ కూడలిలో ఏర్పాటు చేసిన ఉద్యానవనంలో ఇనుప తుక్కుతో చేసిన కళాకృతులు రంగులతో ఎంత అందంగా కనిపిస్తున్నాయో చూడండి. కానీ రామవరప్పాడు రింగ్ నుంచి మహానాడు కూడలి వరకూ ఉన్న ఉద్యానవనం మాత్రం వెలవెలబోతోంది.

- ఈనాడు, అమరావతి


రంగులు లేని ఊసరవెల్లి..


పులి ఇలా..


పోలీసు కంట్రోల్ పాయింట్ దగ్గర పార్కులో రంగులతో కళకళలాడుతున్న బొమ్మలు..

శుభాకాంక్షల వెల్లువ


కొనకళ్ల నారాయణకు మొక్క ఇస్తున్న రాష్ట్ర నాయకులు

విజయవాడ బస్‌స్టేషన్, న్యూస్‌టుడే: ఏపీఎస్‌ఆర్టీసీ నూతన ఛైర్మన్‌గా నియమితులైన కొనకళ్ల నారాయణను బుధవారం సచివాలయంలో కార్మిక పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్వీ శేషగిరి, ప్రధాన కార్యదర్శి వై. శ్రీనివాసరావు, కోశాధికారి సురేంద్ర మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపినట్లు ఆర్టీసీ కార్మిక పరిషత్ జిల్లా కార్యదర్శి వై. రమేష్ తెలిపారు.

సీఎం కార్యక్రమం..
ఆకస్మికంగా వైద్యుల రాక
☛ ఎన్టీఆర్ కలెక్టరేట్ వద్ద ఉత్కంఠ


మ్యూజియం రోడ్డులో బైఠాయించిన ప్రభుత్వ వైద్యులు

విజయవాడ (గవర్నర్‌పేట), న్యూస్‌టుడే : ఎన్టీఆర్ కలెక్టరేట్‌లో బుధవారం ఉదయం.. వరద బాధితులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం జరుగుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఇతర మంత్రులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సమయంలో.. ఒక్కసారిగా ప్రభుత్వ వైద్యులు అధిక సంఖ్యలో కలెక్టరేట్ వద్దకు తరలిరావడంతో ఉత్కంఠ నెలకొంది. పోలీసులు కంగుతిన్నారు. బారికేడ్లు అడ్డుపెట్టి వారిని అడ్డుకున్నారు. పీజీ కోర్సుల ప్రవేశాల్లో తాము ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి వివరిస్తామని వైద్యులు పేర్కొన్నారు. రోడ్డుపై బైఠాయించి ముఖ్యమంత్రి గారు... మా సమస్యలు చూడండి' అనే ప్లకార్డులు ప్రదర్శించారు. పలువురు వైద్యులు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న తమకు పీజీ కోర్సుల్లో ప్రవేశానికి గతంలో 30 శాతం రిజర్వేషన్ ఉండేదని చెప్పారు. ఇపుడు దీన్ని తగ్గించారని వాపోయారు. 19 రకాల స్పెషలైజేషన్ కోర్సుల ప్రవేశానికి ప్రాధాన్యం ఇచ్చేవారని.. ఇపుడు వాటిని అయిదింటికి కుదించారన్నారు. గతంలో 5 సంవత్సరాలు పాటు ప్రభుత్వ వైద్యశాలల్లో పని చేస్తామని బాండ్ ఇచ్చేవారమని.. ఇపుడు దాన్ని పదేళ్లకు పెంచారని ఆవేదన వ్యక్తం చేశారు. బాండ్ నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.25లక్షలు పెనాల్టీ కట్టేవారమని, ఇపుడు దాన్ని రూ.50లక్షలకు పెంచారని పేర్కొన్నారు. గతంలో ఉన్న నిబంధనలు మార్చి తమకు అన్యాయం చేస్తున్నారని వాపోయారు. వీటిని పరిష్కరించాలని నినాదాలు చేశారు. పోలీసులు.. కొంత మంది నిరసనకారులను ముఖ్యమంత్రి వద్దకు తీసుకువెళ్లగా.. సమస్యలను సీఎంకు వివరించారు. వాటిని పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటామని చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారని ప్రభుత్వ వైద్యాధికారుల ప్రతినిధులు వెల్లడించారు.

చంద్రబాబు నిర్ణయమే శిరోధార్యం

విజయ డెయిరీ ఛైర్మన్ చలసాని


వీరవల్లి యూనిట్‌లో సమావేశమైన పాలకవర్గ సభ్యులు

హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే : విజయ డెయిరీ ఛైర్మన్‌గా తాను కొనసాగాలా, వద్దా అనే విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయమే తనకు శిరోధార్యమని డెయిరీ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. బుధవారం కృష్ణా జిల్లా వీరవల్లి యూనిట్‌లో పాలకవర్గ సభ్యుల అత్యవసర సమావేశం జరిగింది. అనంతరం చలసాని విలేకరులతో మాట్లాడారు. తనను రాజీనామా చేయాల్సిందిగా పార్టీ పెద్దల నుంచి సమాచారం వచ్చిన విషయం వాస్తవమేనని చెప్పారు. 2019లో చంద్రబాబు కారణంగానే తనకు ఛైర్మన్ పదవి వచ్చిందని, ఆయనకు వ్యతిరేకంగా ఎప్పుడూ వ్యవహరించలేదన్నారు. తాజా పరిణామాల్లోనూ ఆయన మాటే తనకు శిరోధార్యమని పేర్కొన్నారు. అయిదేళ్ల నాలుగు నెలలు ఛైర్మన్‌గా ఉన్న తాను సంస్థ అభివృద్ధికి శ్రమించానని, ఉమ్మడి జిల్లాలో ఉన్న పాడి రైతులందరికీ ఈ విషయం తెలుసు అన్నారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ కొత్త ఫ్యాక్టరీ నిర్మించామని, ఇటీవల వరదల్లో పాత ఫ్యాక్టరీ మునిగిపోతే ఇదే ఆపద్బాంధవిగా నిలిచిందన్నారు. తెదేపా ఆవిర్భావం నుంచి తాను పార్టీలో క్రియాశీలకంగా ఉన్నానన్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో ఆ పార్టీకి చెందిన ఎవరితోనూ తాను అంట కాగలేదని, రాజకీయాలకతీతంగా విజయ డెయిరీ నడుస్తున్నందునే తాను ప్రత్యక్షంగా తెదేపా తరఫున రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరించలేదన్నారు. డైరెక్టర్లంతా చంద్రబాబుని కలిసిన తర్వాతే నిర్ణయం తీసుకుందామని చెప్పారని, ఆ మేరకే తన కార్యాచరణ ఉంటుందని తెలిపారు.

❖ సీఎంతో భేటీకి నిర్ణయం

పార్టీ ఆదేశాల నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం వీరవల్లి యూనిట్‌లో పాలకవర్గ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఛైర్మన్‌తో పాటు, మాజీ ఎమ్మెల్యే, డైరెక్టర్లలో ఒకరైన దాసరి బాలవర్ధనరావు, మరో పది మంది డైరెక్టర్లు హాజరయ్యారు. ముగ్గురు మాత్రం పలు కారణాలతో గైర్హాజరయ్యారు. తనను రాజీనామా చేయాల్సిందిగా పార్టీ నుంచి వచ్చిన ఆదేశాలను చలసాని డైరెక్టర్లకు వివరించారు. దీనిపై కొద్దిసేపు చర్చ జరిపారు. ఒక దశలో సమావేశం నుంచి బయటకు వచ్చిన చలసాని తాను రాజీనామా చేసేస్తానని, మీడియాను పిలవాలంటూ భావోద్వేగానికి గురయ్యారు. సముదాయించిన సభ్యులు తొందరపాటు నిర్ణయం వద్దని, అందరం కలిసి సీఎం చంద్రబాబుని కలిసి మాట్లాడి, ఆ తర్వాత నిర్ణయం తీసుకుందామని సర్ది చెప్పారు.

❖ బోనస్ ప్రకటన

దసరా పండగ సందర్భంగా ఏటా మాదిరిగానే ఉద్యోగులు, పాల సంఘాల కార్యదర్శులకు విజయ డెయిరీ తరఫున బోనస్ ప్రకటించారు. ఉద్యోగులకు రూ.5.30 కోట్లు, పాల సంఘాల కార్యదర్శులకు రూ.1.32 కోట్లు చొప్పున ఇవ్వాలని నిర్ణయించినట్లు ఛైర్మన్ ప్రకటించారు.

ప్రతిష్ఠాత్మకంగా దసరా ఉత్సవాలు


అధికారులతో చర్చిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు సుజనా చౌదరి, కామినేని శ్రీనివాస్

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: దసరా ఉత్సవాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని ఎమ్మెల్యే సుజనాచౌదరి అన్నారు. తాడిగడపలోని ఎమ్మెల్యే కార్యాలయంలో దసరా ఏర్పాట్లపై వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, గద్దె రామ్మోహన్‌రావులతో కలిసి చర్చించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సుజనా చౌదరి మాట్లాడుతూ.. ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత నిర్వహిస్తున్న దసరా ఉత్సవాలు భక్తుల మదిలో నిలిచే విధంగా ఏర్పాట్లు ఉండాలన్నారు. భక్తులకు తాగునీరు, ప్రసాదాలు, దర్శనం విషయాల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి వేలాది భక్తులు, ప్రముఖులు అమ్మవారి దర్శనానికి వస్తారని తెలిపారు. భద్రత, పారిశుద్ధ్యం, పార్కింగ్ తదితర విషయాల్లో అలసత్వం వద్దని పేర్కొన్నారు. ప్రసాదం తయారీలో పరిశుభ్రత, నాణ్యత ఉండాలని సూచించారు. డీసీపీ హరీశ్‌బాబు, ఏసీపీ రామకృష్ణ, పశ్చిమ ఏసీపీ దుర్గారావు, దుర్గగుడి ఈఈలు కోటేశ్వరరావు, రమాదేవి, వైకుంఠరావు పాల్గొన్నారు.

పలు రైళ్లు పాక్షికంగా రద్దు.. దారి మళ్లింపు



విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: విజయవాడ డివిజన్‌లో నిర్వహణ పనుల దృష్ట్యా పలు రైళ్లను పాక్షికంగా రద్దు చేయడంతో పాటు దారి మళ్లిస్తున్నట్లు విజయవాడ రైల్వే అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

❖ పాక్షికంగా రద్దయినవి: (రామవరప్పాడు-విజయవాడ) ఈ నెల 30వ తేదీ నుంచి అక్టోబరు 27 వరకు 07896 మచిలీపట్నం-విజయవాడ, 07769 విజయవాడ-మచిలీపట్నం, 07863 నర్సాపూర్-విజయవాడ, 07866 విజయవాడ-మచిలీపట్నం, 0770 మచిలీపట్నం-విజయవాడ, 07283 విజయవాడ-భీమవరం జంక్షన్, 07870 మచిలీపట్నం-విజయవాడ, 07861 విజయవాడ-నర్సాపూర్.

❖ దారి మళ్లించిన రైళ్లు: (వయా విజయవాడ, గుడివాడ, నిడదవోలు మీదుగా)

22643 ఎర్నాకుళం, పాట్నా (ఈ నెల 30, అక్టోబరు 7, 14, 21 తేదీల్లో), 12756 భావనగర్-కాకినాడ పోర్ట్ (అక్టోబరు 6, 12, 19, 26 తేదీల్లో), 12509 బెంగళూరు-భువనేశ్వర్ (అక్టోబరు 2, 4, 9, 11, 16, 18, 23, 25), 11019 ఛత్రపతి శివాజీ టెర్మినల్-భువనేశ్వర్ (ఈనెల 30, అక్టోబరు 2, 4, 5, 7, 9, 11, 12, 14, 16, 18, 19, 21, 23, 25, 26), 13351 ధన్‌బాద్-అల్లపూజ (ఈ నెల 30 నుంచి అక్టోబరు 27వరకు), 18111 టాటా-యశ్వంత్‌పూర్ (అక్టోబరు 3, 10, 17, 24 తేదీల్లో) దారి మళ్లించినట్లు తెలిపారు.

29న టెట్ హిందీ మోడల్ పరీక్ష

సీతారాంపురం, న్యూస్‌టుడే: నగరంలోని హిందీ సేవాసదన్ ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీన ఏపీ టెట్ హిందీ ఆన్‌లైన్ మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నామని ప్రధాన కార్యదర్శి ఎస్.గైబువలీ తెలిపారు. హిందీ సేవాసదన్ యాప్‌లో మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు రాష్ట్రస్థాయిలో పరీక్ష నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 95813 86150, 95536 77119 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

డీసీపీ క్రైమ్స్‌గా తిరుమలేశ్వరరెడ్డి

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : రాష్ట్రంలో పలువురు ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా వెయిటింగ్‌లో ఉన్న కె.తిరుమలేశ్వరరెడ్డిని ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్‌లో డీసీపీ క్రైమ్స్‌గా నియమించారు.

తిరుమల ప్రక్షాళన అత్యవసరం

❖ రౌండ్ టేబుల్ సమావేశంలో స్వామీజీలు


సమావేశంలో కమలానంద భారతీ స్వామి, శివస్వామి, మాతాజీ శివచైతన్య, హజరత్తయ్య గుప్తా, భక్తిచైతన్యానంద స్వామి, సీతారామాంజనేయస్వామి, సత్యానందయోగి తదితరులు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : పవిత్ర తిరుమలను సమూలంగా ప్రక్షాళన చేయాలని స్వామీజీలు డిమాండ్ చేశారు. లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి ఘటనపై విచారణ జరపాలని కోరారు. బుధవారం హిందూ ఐకాస ఆధ్వర్యంలో విజయవాడలోని ఓ హోటల్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. తాళ్లాయపాలెం శైవక్షేత్రం పీఠాధిపతి శివస్వామి మాట్లాడుతూ.. తితిదే ఆధ్వర్యంలో గోశాల ఏర్పాటు చేసి, స్వచ్ఛమైన నెయ్యిని పవిత్ర లడ్డూ తయారీకి వాడాలని కోరారు. తితిదేతోపాటు ఇతర దేవస్థానాల కమిటీల సభ్యులుగా పరిపూర్ణ హిందువులను మాత్రమే నియమించాలని సూచించారు. సనాతన బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తిరుపతి, తిరుమలలో అన్యమత, ఆక్రమిత కట్టడాలను తొలగించాలని డిమాండ్ చేశారు. ధర్మపరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో అక్టోబరు 6వ తేదీన హైదరాబాద్‌లో దాదాపు రెండు వేల మందితో సదస్సు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆధ్యాత్మికవేత్త వేముల హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ.. విశ్వాంతరాలలోని సర్వజనులు వేంకటేశ్వరస్వామి కృపా కటాక్షానికి.. స్వామి ప్రసాదం అయిన లడ్డూని మహాప్రసాదంగా స్వీకరిస్తున్నారని చెప్పారు. అలాంటి ప్రసాదాన్ని కలుషితం చేయడం క్షమించరానిది నేరమన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సిట్ పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. భువనేశ్వరీ మఠం పీఠాధిపతి కమలానంద భారతీ స్వామి మాట్లాడుతూ.. దేవాలయ ఆస్తులు ఆక్రమణకు గురికాకుండా కమిటీలను నియంచాలని సూచించారు. ఏ దేవాలయానికి ఎన్ని ఆస్తులు ఉన్నాయి? అవి ఎక్కడెక్కడ ఉన్నాయో.. ఆన్‌లైన్‌లో ప్రజలముందుంచాలని కోరారు. తిరుమల లడ్డూ కల్తీ ఘటనపై సకాలంలో స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లను స్వామీజీలు అభినందించారు. ఈ కార్యక్రమంలో చైతన్య తపోవన్ మాతాజీ శివచైతన్య, సత్యానందయోగి, భక్తిచైతన్యానంద స్వామి, సుందర్ మొంగళ్, లంకా సీతారామాంజనేయస్వామి, శివాజీ, కె.దిలీప్ కుమార్, పి.మురళీకృష్ణ, రమేష్, త్రిమూర్తులు, ప్రభాకర్, భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

'డోర్ డెలివరీ పేరుతో నల్ల బజారుకు తరలింపు'


మాట్లాడుతున్న బిశ్వంబర్ బసు. పక్కన సంఘ నాయకులు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: వైకాపా పాలనలో డోర్ డెలివరీ పేరుతో బ్లాక్ మార్కెట్టుకు రేషన్ తరలించారని రేషన్ డీలర్ల సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి బిస్వంబర్ బసు అన్నారు. రేషన్ డీలర్ల సమస్యలపై తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ఎండీయూ వాహనాల పేరుతో ప్రజాధనాన్ని గత ప్రభుత్వం రూ.కోట్లలో వృధా చేసిందన్నారు. రేషను డీలర్ల సమస్యలపై తెలంగాణ, దిల్లీ, పశ్చిమ బెంగాల్‌లో తమ సమాఖ్య పోరాటం చేసి సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేసిందన్నారు. ఏపీలో సైతం డీలర్ల సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా ఉన్నారని' పేర్కొన్నారు. తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యులు తొండపు జనార్దన్ మాట్లాడుతూ.. పేదలకు పట్టెడు అన్నం పెట్టేందుకు రేషన్ విధానాన్ని తీసుకు వచ్చింది తెదేపా వ్యవస్థాపకులు ఎన్టీఆర్ అని.. ఆయన కలలు సాకారం చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు రేషన్ విధానంలో అనేక సంస్కరణలు తీసుకు వచ్చారన్నారు. ఎమ్మెల్సీ శ్రీకాంత్ మాట్లాడుతూ.. రేషన్ డీలర్ల సమస్యలను చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. రేషన్ డీలర్ల సమాఖ్య ఆంధ్రా, తెలంగాణ అధ్యక్షులు లీలా మాధవరావు, రాజు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు వెంకటరమణ, వెంకటరామిరెడ్డి, నరసింహారావు, నాని పాల్గొన్నారు.

హోరా.. హోరీగా ఫుట్‌బాల్

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : రాష్ట్ర స్థాయి సీనియర్ మహిళా ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో పలు జట్లు హోరా.. హోరీగా తలపడ్డాయి. కానూరులోని అనుమోలు ప్రభాకర్ మైదానంలో బుధవారం జరిగిన మ్యాచ్‌ల్లో క్రీడాకారిణులు ఉత్సాహంగా తలపడ్డారు. పూల్ 'ఎ'లో అనంతపురం, పూల్ 'బి'లో శ్రీసత్యసాయి, పూల్ 'సి'లో కడప, పూల్ 'డి'లో కర్నూలు జట్లు విజేతగా నిలిచి సెమీ ఫైనల్స్‌లో ప్రవేశించాయి. మధ్యాహ్నం జరిగిన తొలి సెమీ ఫైనల్స్ మ్యాచ్‌లో అనంతపురం జట్టు 3-0 గోల్స్ తేడాతో కడప జట్టుపై విజయం సాధించి ఫైనల్ బెర్త్ ఖరారు చేసుకుంది. చివరి రోజైన గురువారం రెండో సెమీస్‌లో శ్రీసత్యసాయి, కర్నూలు జట్లు తలపడనున్నాయి. అనంతరం మూడో స్థానం కోసం, ఫైనల్ మ్యాచ్‌లు జరుగుతాయని ఎన్టీఆర్ జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వై.శేషగిరిరావు, బి.చక్రవర్తి తెలిపారు.


మ్యాచ్‌లో తలపడుతున్న కర్నూలు, ఎన్టీఆర్ జిల్లాల క్రీడాకారిణులు

సర్పంచి భార్య ఆత్మహత్యాయత్నం


బాధితురాలు కవితను విజయవాడ తరలిస్తున్న కుటుంబ సభ్యులు

తిరువూరు, న్యూస్‌టుడే: తన పట్ల ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు చేసిన అసభ్యపదజాలం కారణంగానే తన భార్య కవిత నిద్రమాత్రలు మింగిందని మండలంలోని చిట్టేల తెదేపా సర్పంచి తుమ్మలపల్లి శ్రీనివాసరావు ఆరోపించారు. స్థానిక ఆస్పత్రి వద్ద బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. మంగళవారం స్థానిక రాజస్థాన్ సెంటర్‌లోని అడ్డాకూలీ వద్ద భవన నిర్మాణ కార్మికుల సమస్యలు తెలుసుకోవడానికి వచ్చిన ఎమ్మెల్యే పరుషపదజాలంతో హెచ్చరించడంతో ఆయన చేసిన అనుచిత వ్యాఖ్యలు జీర్ణించుకోలేని నా భార్య ఆత్మహత్యకు ప్రయత్నించిందన్నారు. తిరువూరులోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించామని..పరిస్థితి విషమంగా ఉండడంతో విజయవాడ తరలించామని వాపోయారు. ఇంతే కాక బెదిరింపులకు పాల్పడ్డారని..బుధవారం 20 మంది రౌడీలతో చిట్టేల వచ్చిన ఆయన యువకుల ముందు దూషించడమే కాకుండా, పొలానికి వెళ్తున్న తనపై దాడికి యత్నించారని ఆరోపించారు.

బ్రాయిలర్ ధరలు
(కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -121 రిటైల్ ధర 143 చికెన్ విత్ స్కిన్ - 207, చికెన్ స్కిన్‌లెస్ - 236.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 555 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.86/-.

ఖైదీలను బేషరతుగా విడుదల చేయాలి


మాట్లాడుతున్న ఆంజనేయులు. చిత్రంలో అరసవిల్లి కృష్ణ, శ్రీనివాస్, సుబ్బారావు, సురేష్‌కుమార్ తదితరులు

గాంధీనగర్, న్యూస్‌టుడే : చిలకలూరిపేట బస్సు దహనం కేసులో 32 సంవత్సరాలుగా జైల్లో ఉన్న చలపతి, విజయవర్ధన్‌లను ప్రభుత్వం బేషరతుగా విడుదల చేయాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి.ఆంజనేయులు కోరారు. బుధవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. చేసిన తప్పునకు మూడు జీవిత ఖైదీలు అనుభవిస్తున్నారని.. ఇంత శిక్ష అనుభవించినా విడుదల చేయకపోవడం సరికాదన్నారు. వారిద్దరూ దళిత కుటుంబాలకు చెందిన పేదవారని, వారిలో మార్పు వచ్చిందని, విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. 1999లో పరిటాల రవిని లక్ష్యంగా చేసుకొని హైదరాబాద్‌లో మద్దెలచెరువు సూరి ఏర్పాటు చేసిన ల్యాండ్‌మైన్ పేలి 26 మంది చనిపోయారని చెప్పారు. ఆ కేసులోని నిందితులంతా పదేళ్ల జైలు శిక్ష పూర్తి చేసుకొని విడుదలయ్యారని గుర్తు చేశారు. బస్సు దహనం కేసు నిందితులు దళితులు అవ్వడం వల్లే జైల్లో మగ్గిపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని వివిధ జైళ్లలో 60ఏళ్లు నిండి, 14 సంవత్సరాల జైలు శిక్ష పూర్తి చేసుకున్న ఖైదీలను విడుదల చేయాలని విరసం అధ్యక్షుడు అరసవిల్లి కృష్ణ కోరారు. దీనిపై అక్టోబరు 2న గాంధీ జయంతి సందర్భంగా గుంటూరులో బహిరంగ సభ నిర్వహించాలని సమావేశంలో తీర్మానించారు. ఈ సమావేశంలో న్యాయవాది పిచ్చుక శ్రీనివాస్, దుర్గం సుబ్బారావు, సురేష్‌కుమార్, రోహిత్, భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

